ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

హిందూపురం, మడకశిర, పెనుకొండ :9985445760
ధర్మవరం, పుట్టపర్తి : 9963160529
కదిరి :9052518170
ఏసీఎమ్: 9985411154



టీడీపీలోకి క్యూ

అధికార పార్టీని వీడుతున్న కీలక నేతలు

- కూటమిలోకి వలసల జోరు
- పార్టీ మారద్దంటూ వైసీపీలో బుజ్జగింపులు..
- అయినా బేఖాతరు
- వైసీపీ అభ్యర్థులు డీలా



పుట్టపర్తి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ తెలుగుదేశం కూటమిలోకి వైసీపీ నుంచి చేరికల పరంపర కొనసాగుతోంది. అధికార వైసీపీని వీడి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలోకి నేతలు క్యూ కడుతున్నారు. దీంతో జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో వైసీపీ డీలాపడింది. ఈ నేపథ్యంలో పార్టీ మారవద్దంటూ ప్రాధేయపడుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందునుంచి టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. ఎన్నికల నామినేషన్ల వేళ వలసలు మరింత పెరిగాయి. దీంతో పార్టీ కుండువాలు మారి, టీడీపీ బలగం పెరుగుతోంది. గత ఎన్నికల్లో హిందూపురం అసెంబ్లీ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ పదవికి రాజీనామా చేసి, టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరారు. వైసీపీ చిలమత్తూరు జడ్పీటీసీ సభ్యురాలు గొల్ల అనూష టీడీపీలో చేరగా.. పుట్టపర్తి నియోజకవర్గం నుంచి వైసీపీ నేత, ప్రముఖ న్యాయవాది రాజశేఖర్, తలమర్ల సర్పంచ్ బిల్లే రత్నంతోపాటు నియోజకవర్గం నుంచి వందలాది మంది వైసీపీ నాయకులు.. ఆ పార్టీని వీడి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో హైదరాబాద్‌లో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. రెండ్రోజుల క్రితం ధర్మవరంలో రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాశ్‌బాబు, బత్తలపల్లి జడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ, ఆ మండలానికి చెందిన వైసీపీ నేతలు కూటమి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్‌కు మద్దతు పలికి బీజేపీలో చేరారు. ఇలా జిల్లాలో టీడీపీ కూటమిలోకి అన్ని నియోజకవర్గాల్లో రోజూ భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. కొన్నేళ్లుగా పార్టీకి దూరంగా ఉన్న గ్రామాలు, పలు సామాజిక వర్గాలు.. టీడీపీకి మద్దతు పలుకుతున్నాయి. ఈనేపథ్యంలో పలు నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులు డీలా పడిపోతున్నారు.

2019 ఫలితాలను పరిశీలిస్తే హిందూపురంలో టీడీపీ విజయం సాధించగా.. మిగిలిన ఆరు చోట్ల వైసీపీ గెలుపొందింది. ఈసారి ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు గెలుపు గుర్రాలను బరిలో నిలిపింది. పార్లమెంటు పరిధిలో అన్ని స్థానాలను తమ ఖాతాలో వేసుకోవాలనే లక్ష్యంతో ఆయా నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులతోపాటు నాయకత్వం ప్రణాళికాబద్ధంగా దూకుడు పెంచింది. టీడీపీ కూటమిలోకి కొత్తగా చేరుతున్న వారితో శ్రేణులు ఉత్సాహంగా పనిచేస్తున్నాయి. రాష్ట్రంలో కూటమి గాలి వీస్తున్న నేపథ్యంలో టీడీపీలోకి చేరికలు భారీగా పెరిగాయని విశ్లేషకులు భావిస్తున్నారు. నామినేషన్లు ముగిసిన నేపథ్యంలో అందరి చూపు టీడీపీ కూటమి వైపే అన్న చర్చ నడుస్తోంది.

వైసీపీకి దెబ్బమీద దెబ్బ..


జిల్లాలో హిందూపురం, పెనుకొండ, పుట్టపర్తి, కదిరి, మడకశిర, ధర్మవరం నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిదులతోపాటు కీలక నేతలు వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారు. ఈనేపథ్యంలో తమ పార్టీ నేతలను బుజ్జగించేందుకు ఆయా నియోజకవర్గాల్లో వైసీపీ జాబితాను సిద్ధం చేసి, అగ్రనేతలను రంగంలోకి దింపి బుజ్జగిస్తున్నారు. అయినా పార్టీ వీడుతుండడం ఆ వర్గాల్లో ఆందోళన కల్గిస్తోంది. వింటే హామీలు, లేదంటే డబ్బుతో ఎర వేస్తున్నారు. టీడీపీలోకి వెళ్లకుండా నేతల చుట్టూ అభ్యర్థులు ప్రదక్షిణ చేస్తున్నారు. కొందరు సీనియర్ నేతలకు ప్యాకేజీలు కూడా ప్రకటిస్తున్నారట. అసమ్మతి గళం వినిపిస్తే చాలు క్షణాల్లో అక్కడ నేతలు వాలిపోతున్నారు. ఎన్ని బుజ్జగింపులు చేస్తున్నా వైసీపీలో కీలకనేతలు వీడుతుండడం, టీడీపీలోకి చేరికలు పెరిగాయి. టీడీపీలోకి క్యూకడుతున్న నేపథ్యంలో అధికార పార్టీలో తమ నేతలు ఎక్కడ జారిపోతారోనన్న ఆలజడి మొదలై నిఘా వేసే పరిస్థితి వచ్చింది. టీడీపీలోకి చేరికలను చూసి తమ పార్టీలోకి వలసలు కడుతున్నారంటూ కలరింగ్ కోసం వైసీపీ వారే మళ్లీ కండువాలు వేస్తున్నారు. నామినేషన్ల, ప్రచారం పర్వం మొదలయ్యేనాటికి వైసీపీ ఖాళీ అవుతుందన్న చర్చ నడుస్తోంది.



బలగం పెరుగుతోంది..

జిల్లాలో ఏనోట విన్నా వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులే గెలుస్తారన్న చర్చ నడుస్తోంది. కూటమి అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. అధికార వైసీపీని దీటుగా ఎదుర్కోవడానికి టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి గెలుపు గుర్రాలనే బరిలో నిలిపింది. ఈనేపథ్యంలో పలు సామాజికవర్గాలు టీడీపీకి మద్దతు పలుకుతున్నాయి. ధర్మవరంలో కూటమి తరఫున బీజేపీ అభ్యర్థి పోటీ చేస్తున్నప్పటికీ అక్కడ టీడీపీ, జనసేనతో ఎాటు అందరూ కలిసికట్టుగా ముందుకు సాగుతున్నారు. ఇటీవల ధర్మవరంలో వైసీపీ చేనేత విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిర్రాజు నాగేష్, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణయాదవ్‌తోపాటు మలకవేముల ఎంపీటీసీ మల్లికార్జున.. వైసీపీని వీడి బీజేపీలో చేరారు. ఇలా ధర్మవరం వైసీపీలో బలమైన బీసీ నాయకుల రాజీనామాలతో వైసీపీలో కలకలం మొదలైంది. కదిరి నియోజకవర్గం తనకల్లు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ ఈశ్వరెడ్డి తన పదవితోపాటు పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. హిందూపురంలో కోడూరు మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ వైసీపీలో కీలక నేత సోమశేఖర్ తన అనుచరవర్గంతో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సమక్షంలో టీడీపీలో చేరారు. ఇలా పెనుకొండ, మడకశిర, కదిరి, రాప్తాడు, పుట్టపర్తిలో గ్రామాగ్రామానా టీడీపీలోకి చేరికల పరంపర కొనసాగుతోంది. దీంతో వైసీపీకి ముచ్చెమటలు పడుతున్నాయి. ఇదేస్థాయిలో అన్ని నియోజకవర్గాల్లో చాలామంది వైసీపీ ప్రజాప్రతినిధులతోపాటు ద్వితీయశ్రేణి నేతలు ఆ పార్టీని వీడి, టీడీపీలోకి చేరేందుకు సిద్ధమవుతున్నారు.





కూటమి అభ్యర్థుల విజయంతోనే రాష్ట్రాభివృద్ధి

కందికుంట వెంకటప్రసాద్ నామినేషన్ దాఖలు



ఆర్వోకి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కందికుంట

కదిరి, ఏప్రిల్ 25: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థుల విజయంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి ఆయన కూటమి అభ్యర్థిగా స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విభజన అనంతరం ఐదేళ్లపాటు రాష్ట్రాభివృద్ధికి తెలుగుదేశం ఎంతో కృషి చేసిందన్నారు. అమరావతి, పోలవరం, కియలాంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్.. రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారన్నారు. సంక్షేమం పేరుతో బటన్ నొక్కి పేద, మధ్యతరగతి ప్రజల పీక నొక్కారని మండిపడ్డారు. ప్రజలకు గత ఎన్నికల్లో ఎన్నో వాగ్దానాలు ఇచ్చి ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఎన్డీఏ కూటమిని గెలిపించాలని కోరారు. వైసీపీ మత విద్వేషాలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుకోవాలని చూస్తోందన్నారు. వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట్ల అంజినప్ప, నాయకుడు పవన్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

బరిలో 226 మంది

ముగిసిన నామినేషన్లు

ఎంపీకి 40.. ఎమ్మెల్యే స్థానాలకు 186 దాఖలు.. నేడు పరిశీలన

పుట్టపర్తి, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ ఘట్టం గురువారం ముగిసింది. జిల్లాలో మొత్తం 226 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో ఎంపీ స్థానానికి 40, ఆరు అసెంబ్లీ స్థానాలకు 186 నామినేషన్లు వచ్చాయని అధికార వర్గాలు తెలిపాయి. టీడీపీ, వైసీపీ అభ్యర్థులు ఒక్కొక్కరు రెండు,మూడు సెట్లు దాఖలు చేశారు. బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, కమ్యూనిస్టులు, నవతరం పార్టీ, ఏపీఆర్ఎస్, జైభీం భారత్ పార్టీ, ఇండియన్ ప్రజాకాంగ్రెస్, రాడికల్ పార్టీ, అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్, జైభారత్ నేషనల్ పార్టీలతోపాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఆయా నియోజకవర్గాల్లో వచ్చిన నామినేషన్లను ఎన్నికల అధికారులు శుక్రవారం పరిశీలిస్తారు. వివరాలు సరిగా లేకపోతే తిరస్కరిస్తారు. ఈనెల 29వ తేదీ వరకు నామినేషన్ ఉపసంహరణకు గడువు ఉంటుంది.

అసెంబ్లీ స్థానానికి నామినేషన్లు ఇలా..

అసెంబ్లీ స్థానం	నామినేషన్ల సంఖ్య
మడకశిర	35
హిందూపురం	34
పెనుకొండ	25
ధర్మవరం	26
పుట్టపర్తి	38
కదిరి	28
మొత్తం	186



నామినేషన్ వేసేందుకు ఆర్వో కార్యాలయానికి ఓపెన్‌టాప్ కారులో వస్తున్న ఉషశ్రీ



ఆర్వో కార్యాలయం వరకు ఓపెన్ టాప్ కారులో ప్రయాణం
స్వామిభక్తి చాటుకున్న పోలీసులు

మంత్రికి ఎన్నికల నిబంధనలు వర్తించవా?

మంత్రి, వైసీపీ పెనుకొండ అభ్యర్థి ఉషశ్రీ అధికార దర్పం ప్రదర్శించారు. పెనుకొండలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఆర్వో కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు పోలీసులు బారికేడ్లు ఏర్పాటుచేసి, ఆంక్షలు విధించారు. నామినేషన్ వేయదలచిన అభ్యర్థి, వారి వెంట నలుగురిని మాత్రమే అనుమతిస్తారు. వాహనాలకు ఎంట్రీ లేదు. అభ్యర్థులు నడుచుకుంటూ వెళ్లాల్సిందే. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి సవిత బుధవారం నామినేషన్ సందర్భంగా ఎన్టీఆర్ సర్కిల్‌లోనే పోలీసులు అడ్డుకున్నారు. అక్కడి నుంచి ఆమె నడుచుకుంటూ ఆర్వో కార్యాలయానికి వెళ్లారు. మిగతా అభ్యర్థులంతా ఇలానే వెళ్లారు. మంత్రి ఉషశ్రీ రెండోసెట్ నామినేషన్ వేసేందుకు గురువారం రాగా.. నిబంధనలే అడ్డురాలేదు. ఎన్నికల నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులు స్వామిభక్తి చాటుకున్నారు. ఎన్టీఆర్ సర్కిల్‌లోనే అడ్డుకోవాల్సిన పోలీసులు పట్టించుకోలేదు. దీంతో ఆమె దర్జాగా ఓపెన్ టాప్ కారుపై భర్త శ్రీచరణ్‌తో కలిసి అభివాదం చేస్తూ రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకు వెళ్లారు. అక్కడితో ఆగకుండా అలానే ముందుకెళ్లి అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఉన్న కార్యకర్తలకు ఓపెన్‌టాప్ కారు నుంచి అభివాదం చేస్తూ వెళ్లి రావడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఆమె వెళ్తుంటే అడ్డుకోవాల్సిన పోలీసులు వెంట వెళ్లి రావడం శోచనీయం. ఆర్డీఓ కార్యాలయానికి వాహనంలో రావడంతోపాటు అక్కడే నిబంధనలకు విరుద్ధంగా రోడ్‌షోగా వెళ్లి రావడం ఏంటన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

-పెనుకొండ టౌన్



మంత్రి వెంట వెళ్తున్న పోలీసు సిబ్బంది

ఉషశ్రీ నామినేషన్‌కు జనం కరువు

- డబ్బు, మద్యం ఇచ్చి కర్ణాటక నుంచి తరలింపు



ఉషశ్రీ నామినేషన్ ర్యాలీకి కరువైన జనం

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 25: మంత్రి, వైసీపీ పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ఉషశ్రీ నామినేషన్‌కు జనం కరువయ్యారు. పట్టణంలో గురువారం నిర్వహించిన ర్యాలీలో జనం కనిపించలేదు. నియోజకవర్గం నుంచి ఆశించిన స్థాయిలో జనం రారని ముందుగానే గ్రహించిన ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ.. నామినేషన్‌కు కర్ణాటక, పావగడ, కళ్యాణదుర్గం, హిందూపురం తదితర ప్రాంతాల నుంచి జనాలను తరలించారు. ఒక్కొక్కరికి రూ.300 నగదు, మద్యం, చీరలు ఇచ్చి తీసుకొచ్చారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఆశించిన స్థాయిలో నామినేషన్‌కు జనం రాలేదని వైసీపీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. నామినేషన్‌కు వచ్చిన వాహనాల్లో అత్యధికంగా కర్ణాటక బస్సులు, కార్లే ఉన్నాయి. దీనిని బట్టి కర్ణాటక నుంచి జనాలను తరలించారని ప్రజలు చర్చించుకుంటున్నారు.



'సూక్ష్మ'సాయమూ కరువు..!

అటకెక్కిన సూక్ష్మపోషకాల పంపిణీ

రైతులపై అదనపు భారం

వైసీపీ పాలనలో రైతుపై కనికరమేదీ?



జింక్ సల్ఫేట్

ముదిగుబ్బ: తమది రైతు ప్రభుత్వమని వైసీపీ పాలకులు గొప్పలు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. వైసీపీ పాలనలో అన్నదాతకు కనీస ప్రోత్సాహకం కరువైంది. కొత్త పథకాలను అమలు చేయకపోగా.. అప్పటికే రైతులకు అందుతున్న ప్రయోజనాలనూ అటకెక్కించి అన్యాయం చేశారు. టీడీపీ హయాంలో చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీపై సూక్ష్మపోషకాలు అందించేవారు. తద్వారా రైతుపై భారం తగ్గేది. పంట దిగుబడులు ఆశాజనకంగా వచ్చి, రైతుకు లాభం చేకూరేది. వైసీపీ అధికారం చేపట్టాక ఆ సూక్ష్మసాయాన్ని అటకెక్కించింది. నాలుగేళ్లుగా రైతులకు సబ్సిడీపై సూక్ష్మపోషకాలు అందలేదు. దీంతో రైతులు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. అలా వారిపై అదనపు భారం పడుతోంది. అసలే వ్యసాయ పెట్టుబడులు పెరిగిపోయిన తరుణంలో ఇది అదనపు భారంగా మారింది. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న పాలకులు దీనికి ఏం సమాధానం చెబుతారంటూ అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు.

సూక్ష్మపోషకాలు ఎంతో అవసరం..

ప్రతి మొక్క తన జీవిత చక్రాన్ని పూర్తి చేసుకోవడానికి 19 మూలకాలను ఆహారంగా తీసుకుంటుంది. కొన్ని పోషకాలను ఎక్కువ మోతాదులోనూ, మరికొన్నింటిని తక్కువగా వినియోగించుకుంటుంది. తక్కువ మోతాదులో తీసుకునే వాటిని సూక్ష్మ పోషకాలు అంటారు. జింకు, ఇనుము, రాగి, మాంగనీస్, బోరాన్, మాలిబ్డినం, క్లోరిన్, సోడియం, వెనిడియం, సిలికాన్ వంటివి సూక్ష్మ పరిమాణంలో మొక్కలకు అవసరమవుతాయి. ఇవి మొక్క ఎదుగుదలతోపాటు దిగుబడుల్లో ప్రధాన పాత్ర పోషిస్తాయి. వీటి లోపం ఏర్పడితే దిగుబడులు తగ్గుతాయి. కాగా జిల్లాలో జింకు, బోరాన్ లోపాలున్న భూములే ఎక్కువగా ఉన్నట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు. అలాగే క్షారగుణం ఉన్న నేలలను బాగు చేసేందుకు, వేరుశనగ పైరుకు జిప్సం వాడుతారు. ఈ మూడు రకాల సూక్ష్మ పోషకాలను ప్రస్తుత ప్రభుత్వం ఒక్క కేజీ కూడా పంపిణీ చేయలేదు.

రైతులపై భారం

సాధారణంగా జింకులోపం ఉన్న వరి పైరుకు ఎకరాకు 20 కిలోగ్రాములు, ఇతర పైర్లకు ఎకరాకు 10 కిలోగ్రాముల చొప్పున జింక్ సల్ఫేట్ వేస్తారు. ఇలా మూడు పైర్లకు ఒకసారిగానీ, మూడేళ్లకోసారిగానీ వేయాలి. బోరాన్ లోపం ఉంటే ఎకరాకు కేజీ బోరాక్స్‌ను ఆఖరి దుక్కులో వేస్తారు. నల్ల చవుడు నేతలో ఎకరాకు దాదాపు 200 కిలోల జిప్సం వేసి దున్నుతారు. వేరుశనగలో జిప్సం వాడకం ఎంతో ముఖ్యం. తాలు గింజలు లేకుండా కాయ ఊరడానికి, నూనె శాతం పెరగడానికి ఎకరాకి దాదాపు 200 కిలోల జిప్సం వాడకం తప్పనిసరి. ఇవన్నీ రైతులపై అదనంగా పడుతున్న పెట్టుబడి ఖర్చులు. గత ప్రభుత్వం రెండున్నర హెక్టార్ల వరకు భూమి కలిగిన చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీతో వీటిని ఇచ్చేది. ఒక్కోసారి వంద శాతం సబ్సిడీ కూడా వర్తింపజేసేది. ఇది వారికి ఎంతో ఉపశమనం కల్పించేది. వైసీపీ అధికారం చేపట్టాక ఆ ఊసే మరిచింది.

సూక్ష్మపోషకాలతో నాణ్యమైన దిగుబడులు



మామిడి, దానిమ్మ, కలింగర తదితర పంటల సాగుకు జిప్సం, జింక్, ఇతర సూక్ష్మ పోషకాలు ఎంతో అవసరం. టీడీపీ హయాంలో వంద శాతం సబ్సిడీతో రైతులకు అందించారు. వాటిని పంటకు అందించడం ద్వారా దిగుబడులు నాణ్యతగా వచ్చేవి. ప్రస్తుత ప్రభుత్వం సబ్సిడీపై సూక్ష్మపోషకాల పంపిణీని పూర్తిగా నిలిపేసింది. బహిరంగ మార్కెట్‌లో సూక్ష్మపోషకాలను కొనుగోలు చేయడం రైతుకు భారంగా మారింది. దీంతో పంటలకు అందించలేకపోతున్నాడు. వెరసి పంట దిగుబడి నాణ్యత లోపిస్తోంది. ఈ కారణంగా మార్కెట్లో ధర తక్కువ పలుకుతోంది.

- రాగిపాటి రామ్మోహన్, రైతు, నలయకుంటపల్లి, ముదిగుబ్బ మండలం

దిగుబడి తగ్గుతోంది



టీడీపీ హయాంలో వేరుశనగ పంటకు ఎకరాకు 200 కేజీల జిప్సం సబ్సిడీపై అందించేవారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ ఊసే మరిచిపోయింది. చిన్న, సన్నకారు రైతులు ప్రైవేటు దుకాణాల్లో కొనలేకపోతున్నారు. సూక్ష్మపోషకాలు వినియోగించకపోవడంతో పంట దిగుబడులు తగ్గి, రైతులు నష్టపోతున్నారు.

- నారాయణస్వామి, రైతు, జొన్నలకొత్తపల్లి, ముదిగుబ్బ మండలం

వైసీపీ నాయకుడి వీడియో వైరల్


ఔను.. మద్యం, నగదు ఇచ్చాం..



మద్యం సేవించి మాట్లాడుతున్న వైసీపీ నాయకుడు ఆదిమూర్తి

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 25: వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ నామినేషన్‌కు డబ్బు, మద్యం ఇచ్చి జనాలను రప్పించామని ఆపార్టీ నాయకుడు మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పెనుకొండ నగర పంచాయతీ వెంకటరెడ్డిపల్లి కౌన్సిలర్‌గా పోటీచేసిన వైసీపీ నాయకుడు వెంకటేశ్ తమ్ముడు ఆదిమూర్తి గురువారం పెనుకొండలో ఉషశ్రీ నామినేషన్‌లో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా అతడు మాట్లాడుతూ.. ఒక్కొక్కరికి రూ.300 నగదు, మద్యం ఇచ్చి నామినేషన్‌కు రప్పించామని తెలిపాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన ఆటోడ్రైవర్ కుమారుడు



కుటుంబ సభ్యులతో జ్యోతిప్రసాద్ నాయక్

ముదిగుబ్బ, : మండలంలోని గుడ్డంపల్లి తండాకు చెందిన ఆటోడ్రైవర్ మురళీ నాయక్ కుమారుడు జ్యోతిప్రసాద్‌నాయక్ జేఈఈ మెయిన్స్‌లో మెరిశాడు. గురువారం విడుదలైన ఫలితాల్లో ఎస్టీ కేటగిరీలో 2821, ఓపెన్‌లో 2,08,411 ర్యాంకు సాధించాడు. జ్యోతిప్రసాద్‌నాయక్ తండ్రి ఆటోడ్రైవర్ కాగా.. తల్లి సుజాతాబాయి వ్యవసాయ కూలి పనులకు వెళ్తుంటారు. అనంతపురం నారాయణ కళాశాలలో ఇంటర్ చదివిన జ్యోతిప్రసాద్ నాయక్ జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకు సాధించడం పట్ల గ్రామస్థులు, స్థానికులు, బంధువులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లాకు ఇద్దరు ఎన్నికల పరిశీలకులు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

పుట్టపర్తి, ఏప్రిల్ 25: జిల్లాలో ఏడు నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకులుగా సీనియర్ ఐఏఎస్ అధికారులు కర్ణాటకకు చెందిన అన్బుకుమార్, మహారాష్ట్రకు చెందిన దీపక్ రామచంద్ర తివారీని ఈసీ నియమించింది. వారు గురువారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ అరుణ్‌బాబును కలిసి, బాధ్యతలు స్వీకరించారు. మడకశిర, హిందూపురం, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల పరిశీలకుడిగా అన్బుకుమార్ వ్యవహరించనున్నారు. ఈ నియోజకవర్గాల్లో ఎన్నికల ఉల్లంఘనలపై 9849288783 నంబరుకు ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు. రాప్తాడు, పెనుకొండ, ధర్మవరం, నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకుడిగా దీపక్ రామచంద్ర తివారీ వ్యవహరించనున్నారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై 9849288782 నంబరుకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

సత్యసాయి బోధనలు.. చైనీస్ భాషలోకి..

శ్రీసత్యసాయి మాండరిన్ చానల్ ప్రారంభం



చానల్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్

పుట్టపర్తి, ఏప్రిల్ 25: సత్యసాయి బోధనలను చైనీస్ భాషలోకి అనువదిస్తూ ప్రత్యేకంగా యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించారు. స్థానిక ప్రశాంతి నిలయంలోని మీడియా సెంటర్‌లో శ్రీసత్యసాయి మాండరిన్ పేరిట యూట్యూబ్ చానల్‌ను గురువారం సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. సత్యసాయి బోధనలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న చైనీస్ భక్తులకు చేర్చేందుకు చానల్‌ను ప్రారంభించామన్నారు. సత్యసాయి బోధనలు తెలుగు, ఆంగ్లం మాత్రమే కాకుండా ప్రపంచంలోని ప్రధాన భాషల్లోకి తర్జుమా చేసి, భక్తులకు చేర్చడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సత్యసాయి మీడియా సెంటర్ డైరెక్టర్ సుందరస్వామి నాథన్, శ్రీసత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ జోన్-5 చైర్మన్ దనేష్ వద్వాని పాల్గొన్నారు.

WANTED
Full Time Electrician and Plumber. VRM Group Palasamudram.
Cont:8179414141.

MONTESSORI ELITE E.M.SCHOOL
Affiliated to CBSE, New Delhi
WANTED
TEACHING
- English Teachers
- Social Teachers
- Biology Teachers
- Computer Teachers
- Chemistry Teachers
- Librarian
- Math Teachers
- Tutors
- Hindi Teachers
- Junior Lecturers

NON - TEACHING
- Custodians
- Nurse

WALK - IN - INTERVIEW
Date:25 April 2024 - 30 April 2024
Timings: 09:00 AM - 1:00 PM
For More details: +91 8340038384
Near Marur TollGate,Chapatla Road Gollapalli Village, Rapthadu Mandal Anantapur - Dist - 515672

ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్ఠం కనిష్ఠం	41.0 26.0	40.0 25.0	41.0 27.0	39.0 24.0	38.0 26.0

కోట్లాట !

ఎన్నికల విజయంపై బెట్టింగుల జోరు
ఐపీఎల్ పందేలను మరిపిస్తున్న వైనం
తాడిపత్రి ఫలితంపై పక్క జిల్లాల నుంచి పందేలు
ఉచ్చులో సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ ఉద్యోగులు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 25: ప్రస్తుత ఎన్నికల సీజన్‌లో బెట్టింగ్‌లు మొదలయ్యాయి. ఐపీఎల్ క్రికెట్ పోటీలను మరపించే రీతిలో పందేలు జరుగుతున్నాయి. ఎన్నికలు వచ్చాయంటే అందరి చూపు తాడిపత్రి వైపు ఉంటుంది. రాష్ట్రంలో కొందరు తమ నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను పట్టించుకోకుండా తాడిపత్రిలో పరిస్థితులు ఎలా ఉన్నాయో ఆరా తీస్తుంటారు. నియోజకవర్గానికి సమీపంలో ఉన్న కర్నూలు, కడప, నంద్యాల జిల్లావాసులు తాడిపత్రి ఫలితం గురించి రూ. కోట్లలో బెట్టింగ్‌లు కాస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఎన్నికలు ఇంకా 17 రోజులు ఉండగానే నియోజకవర్గంలో బెట్టింగ్‌లు తారస్థాయికి చేరాయి. కోట్ల రూపాయలు పెట్టి పందేలు కాస్తున్నారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని యాడికి, రాయలచెరువుకు చెందిన ఐదుగురు వ్యక్తులు సిండికేట్‌గా ఏర్పడి కోటి రూపాయల వరకు బెట్టింగ్ పెట్టినట్లు చర్చించుకుంటున్నారు. తాడిపత్రి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి 13500 ఓట్ల మెజార్టీతో గెలుపొందుతాడని కొందరు, వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి 13500 ఓట్ల మెజార్టీతో గెలుస్తాడని కొందరు రూ.30లక్షలు బెట్ వేసుకున్నట్లు సమాచారం. బెట్టింగ్ కోసం ఒక నాయకుడి వద్ద నగదు లేకపోవడంతో తన ఇంటి పత్రాలను పూచీకత్తుగా పెట్టి నట్లు చర్చ సాగుతోంది. 2019 ఎన్నికల్లో వైసీపీ విజయానికి మూలకారణమైన పెద్దవడుగూరు మండలంలో ఈ సారి ఆపార్టీ మెజార్టీ మరింత ఎక్కువగా ఉంటుందని పందేలు కాస్తున్నట్లు సమాచారం.

> **మేము సైతం అంటూ ప్రభుత్వ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు**
>
> డబ్బుల మీద అత్యాశతో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా ఈ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. వర్క్‌ఫ్రం హోం చేస్తున్న కొందరు సాఫ్ట్‌వేర్లు నేరుగా బెట్టింగ్‌కు పాల్పడితే తమ హోదాకు భంగం వాటిల్లుతుందన్న భయంతో మిత్రులు, నమ్మకస్తుల ద్వారా పందెం కాస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో పనిచేస్తున్న వారు నేరుగా ఏజెంట్లకు ఫోన్లు చేసి బెట్టింగ్ ఆడుతున్నారని సమాచారం.

రెండింతలు, మూడింతలతో బెట్టింగ్

ఆరునూరైనా ఈసారి ఎన్నికల్లో తాడిపత్రిలో తమ జెండా ఎగురుతుందని ఎవరికి వారు ప్రధాన పార్టీల సానుభూతిపరులు బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. సాధారణంగా ఎంత మొత్తం బెట్ కడితే గెలిచిన వారికి అంతే మొత్తం ఇస్తుంటారు. కానీ రెండు, మూడు రెట్లు ఎక్కువ ఇస్తామంటూ పందేలు కడుతున్నట్లు సమాచారం. దీనికి ఆశపడుతున్న కొందరు యువకులు అప్పులు చేసి మరీ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. వంద నుంచి 120సీట్లు సాధించి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని పలువురు లక్షకు రూ.2లక్షలు ఇస్తామని చెబుతున్నారు. ఇప్పటికే టీడీపీ, వైసీపీ నాయకులు కలిసి ముందు పార్టీలు ఏర్పాటు చేసుకొని మరీ బెట్టింగులకు దిగుతున్నారన్న చర్చ జరుగుతోంది.



మైనార్టీలను మభ్యపెడుతున్నారా..?

- మగ్బుల్ మాటలను ఆ వర్గాలు నమ్ముతాయా..?
- కదిరిలో వైసీపీ ద్వంద్వ వైఖరిపై మైనార్టీల ఆగ్రహం

కదిరి, ఏప్రిల్ 25 : ఎన్నికల ప్రచారంలో భాగంగా కదిరి వైసీపీ అభ్యర్థి బీఎస్ మగ్బుల్ అహమ్మద్ చెబుతున్న మాటలను మైనారిటీలు నమ్ముతారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ మంత్రి అంబటి రాంబాబు ఇటీవల ఓ టీవీ చానల్లో మాట్లాడుతూ తాము భేషరతుగా బీజేపీకి మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. బీజేపీ పెట్టిన బిల్లులు అన్నిటికి వైసీపీ మద్దతు తెలిపింది. సీఏఏ, ఎన్ఆర్‌సీకి మద్దతు ప్రకటించింది. ఎంపీ విజయసాయి రెడ్డి గత పార్లమెంటులో బీజేపీ పెట్టిన బిల్లులకు మద్దతు పలికారు. అయినా ఇక్కడ మాత్రం వైసీపీ అభ్యర్థి మగ్బుల్ అహమ్మద్ ఎన్నికల సభల్లో ఎన్ఆర్‌సీ అంటే ముస్లింల ఆస్తులు లాక్కొని బయటకు పంపివేయడమే అని వక్రభాష్యాలు చెబుతున్నారు. ఈ రకమైన మాటలు మైనార్టీలను మభ్యపెట్టడానికి చెబుతున్నారని ఆ వర్గాల నుంచే విమర్శలు వస్తున్నాయి. ఎన్నికల్లో లబ్ధి పొందడానికే మగ్బుల్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆ వర్గాల వారే అంటున్నారు. మైనార్టీలను మోసం చేయడానికి ఇలాంటి మాటలు చెబుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కదిరిలో నిలకడలేని నాయకత్వం నిలుస్తుందాని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఐదు సంవత్సరాలకు ఒక కొత్త అభ్యర్థిని బరిలోకి దింపే వైసీపీ ప్రజల అభివృద్ధి గురించి పట్టించుకుంటుందా అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మైనార్టీలను మభ్యపెట్టడుతున్న వైసీపీ

మైనార్టీలను వైసీపీ మభ్యపెడుతోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వానికి గత పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టిన దాదాపు అన్ని బిల్లులకు మద్దతు తెలిపింది. ఎన్ఆర్‌సీ, సీఏఏ లాంటి అంశాలకు అండగా నిలిచింది. త్రిపుల్ తలాక్, ఆర్టికల్ 370 వంటి బిల్లులకు మద్దతు తెలిపింది. వైసీపీ మంత్రి ఇటీవలే మాట్లాడుతూ తాము బీజేపీకే మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పెట్టిన పార్టీ వైసీపీ అని, అందుకే తాము బీజేపీకి మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించారు. కదిరిలో మాత్రం మైనార్టీల ప్రచార సభల్లో ఎన్ఆర్‌సీ అంటే ముస్లింల ఆస్తులను లాక్కొని బయటకు పంపడమేనని కదిరి వైసీపీ అభ్యర్థి మగ్బుల్ చెబుతున్నారు. ఇలాంటి మాటలు మైనారిటీ ఓట్ల కోసమేనని అంటున్నారు. అసత్యాలను నిజాలుగా చెప్పి ఓట్లు దండుకోవడానికి ఇలాంటి ప్రచారం చేస్తున్నారని మైనార్టీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిలకడలేని వైసీపీ నాయకత్వం

కదిరిలో వైసీపీకి నాయకత్వ లేమి స్పష్టంగా కనిపిస్తోంది. ప్రతి ఎన్నికకు వైసీపీ అభ్యర్థిని మార్చడమే ఇందుకు నిదర్శనం. 2014లో వైసీపీ అభ్యర్థిగా మైనార్టీ వర్గానికి చెందిన అత్తార్ చాంద్‌బాషను బరిలో దింపారు. ఆయన గెలిచిన రెండు సంవత్సరాలకే తెలుగుదేశం పార్టీలోకి చేరిపోయారు. అనక ఇటీవల మళ్లీ వైసీపీలోకి జంప్ అయ్యారు. 2019లో వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ పీవీ సిద్దారెడ్డిని బరిలో నిలిపారు. ఆయన ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి అంతర్గత వర్గపోరుతోనే సరిపోయింది. నియోజక వర్గ అభివృద్ధి చేసిందేమీ లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయనను కనీసం పరిగణలోకి కూడా తీసుకుండా ప్రస్తుత ఎన్నికల్లో బీఎస్ మగ్బుల్ అహమ్మద్‌ను బరిలో దింపారు. మళ్లీ అదే అంతర్గత పోరుసాగుతోంది. ఇలా ప్రతి ఎన్నికకు కొత్తవారిని బరిలోకి దింపడం వారు గెలిచిన తరువాత కనబడకుండా పోవడంపై వైసీపీ కార్యకర్తలతోపాటు ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిలకడలేని వైసీపీ నాయకత్వాన్ని నమ్మి మోసపోయామని ప్రజలు విమర్శిస్తున్నారు.

కూతవేటు దూరం కోతకు ఉపయోగపడింది..!

ముఖ్యమంత్రి నియోజకవర్గం పులివెందులకు కదిరి కూత వేటు దూరంలో ఉంది. కదిరి నుంచి దాదాపు 35 కిలోమీటర్లు. అక్కడి అభివృద్ధికి ఇక్కడి అభివృద్ధికి నక్కకు నాకలోకానికి ఉన్నంత తేడా ఉంది. వందల కోట్లతో అక్కడ అభివృద్ధి జరిగితే ఇక్కడ మాత్రం కోటి రూపాయల అభివృద్ధి కూడా జరగలేదు. ప్రత్యేక నిధులు విడుదల చేయలేదు. కదిరి మాత్రం పులివెందులలో జరిగే హత్యలకు కావలసిన మారాణాయుధాలు సరఫరా చేయడానికి ఉపయోగపడిందని ప్రజలు విమర్శిస్తున్నారు.

మైనార్టీలను మోసం చేస్తున్నారు : డైమండ్ ఇర్ఫాన్, మైనార్టీ నాయకుడు



ఎన్ఆర్‌సీ, సీఏఏ, నాలుగుశాతం రిజర్వేషన్‌లపై కదిరి వైసీపీ అభ్యర్థి మైనార్టీలకు అబద్ధాలు చెప్పి మోసం చేస్తున్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీకి వైసీపీ మద్దతు ప్రకటించలేదా..? ఎన్ఆర్‌సీ, సీఏఏ, 370 ఆర్టికల్, త్రిపుల్ తలాక్ వంటి ఎన్నో వాటికి బీజేపీ మద్దతు ఇవ్వలేదా..? మైనార్టీల ఓట్ల కోసం అసత్య ప్రచారం చేస్తున్నారు. ఈ విషయంలో మైనార్టీలు అప్రమత్తంగా ఉండాలి. టీడీపీతోనే మైనార్టీల రక్షణ, అభివృద్ధి సాధ్యమవుతాయని గుర్తించాలి.



నీరులేక ఎండుతున్న చీనీ చెట్లు



నీరు లేక వదిలేసిన చీనీ తోట

పాలకుల నిర్లక్ష్యం.. రైతుల పాలిట శాపం

ముకుందాపురం రైతుల బతుకు ఛిద్రం
నీరులేక ఎండుతున్న పండ్లతోటలు
ఎమ్మెల్యేకి విన్నవించినా పట్టించుకోని వైనం
నీటి కోసం రైతన్నల ఆక్రందనలు



ట్యాంకర్ ద్వారా సంపులోకి నీరు పెడుతున్న దృశ్యం

గార్లదిన్నె, ఏప్రిల్ 25 : చీనీతోటల పేరు చెబితే టక్కున గుర్తుకు వచ్చేది గార్లదిన్నె మండలం. మరీ ముఖ్యంగా రాష్ట్రంలోనే గార్లదిన్నె మండలం ముకుందాపురం గ్రామం చీనిపండ్లకు ఎంతో పేరుంది. ఆ గ్రామంలో సుమారు 550 కుటుంబాలు ఉన్నాయి. అందులో 90 శాతం మంది రైతులే ఉన్నారు. గ్రామం చుట్టూ ఎక్కడ చూసినా చీనీ తోటలే కనిపిస్తాయి. అలాంటి గ్రామానికి పెనుముప్పు పొంచి ఉంది. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో భూగర్భ జలాలు అడుగంటి బోరుబావుల్లో నీరు ఇంకిపోతోంది. పండ్లతోటలు కళ్ల ఎదుటే ఎండిపోతున్నాయి. దీంతో పండ్లతోటలను ఎలాగైనా కాపాడుకోవాలని రైతులు సుమారు 800 అడుగుల లోతు బోర్లు వేస్తున్నా పాతళగంగమ్మ పైకి రానంటోంది. గార్లదిన్నె, ముకుందాపురం, యర్రగుంట్ల, సంజీవపురం, పెనకచెర్ల, మర్తాడు, బూదేడు తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో రైతులు పండ్ల తోటలను సాగుచేశారు. ముకుందాపురంలోనే సుమారు 20వేల హెక్టార్లలో చీనీ చెట్లను సాగుచేస్తున్నారు. గ్రామ సమీపంలో ఉన్న చెరువుకు పీఏబీఆర్ కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేసేవారు. దీంతో గ్రామంలో భూగర్భ జలాలు పెంపొందడం ద్వారా తాగునీటితో పాటు వ్యవసాయ తోటల్లో బోరుబావుల్లో నీరు సమృద్ధిగా లభ్యమయ్యేవి. ప్రతి ఏటా పీఏబీఆర్ నుంచి కుడి కాలువ ద్వారా వచ్చే నీరు ఈసారి చెరువుకు రాలేదు. చెరువుకు నీరు విడుదల చేయించాలని ముకుందాపురం రైతులు శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త, విద్యా సలహాదారుడు ఆలూరి సాంబశివారెడ్డికి ఎన్నోసార్లు విన్నవించుకున్న ఫలితం శూన్యం. చెరువుకు నీరందక భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోవడంతో బోరుబావుల్లో చుక్క నీరు రావడం లేదు. ఫలితంగా రూ. లక్షలు ఖర్చు చేసి సాగుచేస్తున్న పండ్ల తోటలు కళ్ల ముందు ఎండిపోతుంటే కన్నీటి పర్యంతమవుతున్నారు. కొందరు రైతులు బోర్లలో వచ్చే అరకొర నీటితో పాటు వాటర్ ట్యాంకుల ద్వారా చెట్లకు నీరు అందిస్తుండగా, మరికొందరు చేతకాక వదిలేసుకునే పరిస్థితి నెలకొంది. పండ్ల తోటలను సంరక్షించుకునేందుకు రైతులు పడుతున్న కష్టాలు వర్ణణాతీతం.

> **ఎమ్మెల్యే పట్టించుకోలేదు**
>
> 
>
> గార్లదిన్నె మండలంపైనే నీటి వనరులు ఉన్నాయి. అయినా మండలంలో పండ్లతోటలకు సాగునీరు అందడంలేదు. ఇది ముమ్మాటికీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యమే. కరువు పరిస్థితులు వస్తాయి, చెరువులకు నీరు నింపాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త ఆలూరి సాంబశివారెడ్డిని పలుమార్లు అడిగిన ఏ మాత్రం స్పందించలేదు. వారికి రైతుల పట్ల ఏ మాత్రం బాధ్యత లేదు. అధికారులైతే గ్రామాల వైపు కన్నెత్తి కూడా చూడరు. చెరువు నింపి ఉంటే ఈ రోజు నీటి కష్టాలు వచ్చేవి కావు.
>
> **- హనుమంతురెడ్డి, రైతు, ముకుందాపురం**

పాలకుల నిర్లక్ష్యం.. మాకు శాపం



పాలకుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. గ్రామంలో ఉన్న చెరువుకు నీరు నింపి ఉంటే మా గ్రామానికి ఈరోజు ఈ కష్టం వచ్చేది కాదు. గ్రామంలో చీనీ చెట్లనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నాం. ఏడు ఎకరాల్లో సుమారు 1500 చీనీ చెట్లు సాగుచేసుకున్నా. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. బోరుబావుల్లో చుక్క నీరు రాలేదు. కన్నబిడ్డల్లా చూసుకున్న చీనీ చెట్లు కళ్ల ముందే ఎండిపోతుంటే ట్యాంకర్ల ద్వారా నీరు తోలుకుంటున్నాం. ట్యాంకు రూ. 1200 చొప్పున రోజు మార్చి రోజు 10 ట్యాంకులు నీళ్ల తోటుకుంటున్నాం.

- ఆట్టే పెద్దన్న, రైతు ముకుందాపురం

రైతులంటే చులకన..



ఏడు ఎకరాల పొలంలో 1000 చీనీ చెట్లు సాగుచేశాను. బోరుబావుల్లో రోజురోజుకు నీరు తగ్గిపోతున్నాయి. చీనీ చెట్లు ఎండిపోతున్నాయి. వాటిని కాపాడుకునేందుకు లక్షలు ఖర్చు చేసి నీటి సంపులు ఏర్పాటు చేసుకుని యర్రగుంట్ల, సంజీవపురం గ్రామాల నుంచి ట్యాంకుకు రూ. 1000 నుంచి రూ. 1200 చొప్పున కొనుగోలు చేస్తున్నాం. ఇలా ఎన్నాళ్లు తోలుకోవాలో దిక్కుతెలియడంలేదు. పంటల దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. పెట్టిన పెట్టుబడులే రాలేదు. నీటి సమస్య ఏర్పడి రైతులు అనేక కష్టాలు పడుతుంటే ఇటు అధికారుల..అటు ప్రజాప్రతినిధులు పలకరించిన పాపానపోలేదు.

- సంగప్ప, రైతు, ముకుందాపురం

ప్రజల ఆశ.. ఆకాంక్ష..!

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. ప్రధాన పార్టీ అభ్యర్థులు ప్రచారంలో తలమునకలై ఉన్నారు. అధినాయకత్వంతో పాటు స్థానిక సమస్యలపై అభ్యర్థులు సైతం ఓటర్లకు అనేక హామీలు ఇస్తున్నారు. ఈ సందర్భంగా కొందరు ఓటర్లు కూడా తమ ఆశలు, ఆకాంక్షలు వారి ఎదుట వెలిబుచ్చుతున్నారు. మీడియా పలుకరించిన సందర్భంలో మరి కొందరు ఈ ప్రభుత్వంలో జరిగిన నష్టం, వచ్చే ప్రభుత్వం చేయాల్సిన వాటిపై అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. అవి ఇలా...

రైతుల నోట మట్టికొట్టారు



గతంలో వ్యవసాయ, డిప్పు పరికరాలకు 90 శాతం వరకు రాయితీ ఇచ్చేవారు. దీంతో పొలాల్లో బోర్లు వేయించుకుని బొప్పాయి, కలింగర, దోస తదితర పంటలు సాగు చేసుకునేవాళ్లం. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాయితీని ఎత్తివేసి రైతుల నోట మట్టికొట్టారు. ఎద్దుల గుంటక పట్టుకారకు రూ.650 పెట్టా, గతంలో రూ.250లకు దొరకేది. నాలుగేళ్లలో రెండితల ధరలు పెరిగి పెట్టుబడి భారంగా మారింది. కష్టపడి పండించిన పంటకు మాత్రం ధరల్లేవు. రూ.50వేల పెట్టుబడికి రూ.5వేలు వస్తే రైతులు ఎలా బాగుపడుతారు? రైతాంగాన్ని అదుకుని అభివృద్ధిబాటలో నడిపించే ప్రభుత్వం రావాలి.

- సూరప్ప, రైతు, చోళసముద్రం

వ్యాపారాలు పడిపోయాయి..



రోజుకు రూ.వెయ్యి జరిగే వ్యాపారం రూ.300లకు పడిపోయింది. రైతుల నుంచి మార్కెట్‌కు చేర్చేందుకు నాలుగు రెట్ల వ్యయం అవుతోంది. ఈ భారం మొత్తం ధరల రూపంలో వినియోగదారులపై పడుతోంది. దీంతో అమ్మకాలు తగ్గిపోయాయి. ఇంటిల్లిపాది కష్టపడినా కూలి గిట్టడంలేదు. పిల్లల చదువులు, పోషణ, అద్దెలు ఇలా అన్ని భారంగా మారాయి. రూపాయి ఖర్చు చేయాలన్నా పదిసార్లు ఆలోచించాల్సిన పరిస్థితులు వచ్చాయి. చిన్న, చిన్న వ్యాపారులకు ఆర్థిక సాయమందించడం. పెట్టుబడులు, రవాణా తదితర వ్యయాన్ని తగ్గించే సామర్థ్యం కలిగిన ప్రభుత్వం వస్తే అందరికీ బాగుటుంది.

- కృష్ణ, కూరగాయల వ్యాపారి

పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలి



పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో గిట్టుబాటు కావడం లేదు. రూ.100తో లీటర్ డీజిల్ కొట్టిస్తే 20 కిలోమీటర్ల మైలేజీ వస్తుంది. ఐదుగురు ప్రయాణికులతో రూ.20చొప్పున చార్జీలు తీసుకున్నా మొత్తం డీజిల్‌కే సరిపోతుంది. ఇంటికేమి తీసుకెళ్లాలి?, ఆటో రిపేరీలు ఎలా చేయించాలి?. ఏడాదికి రూ.10వేల సాయాన్ని ప్రభుత్వ అందిస్తుంది. ఒక్కసారి ఆటోను షెడ్‌కు తీసుకెళ్తే అంతకుమించి రిపేరీ ఖర్చు చెల్లించాలి. డీజిల్, పెట్రోలు, ఆటోమొబైల్ పరికరాల ధరలు తగ్గించే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి. అప్పుడే జీవితాలు మారుతాయి.

- గంగా ప్రసాద్, ఆటో డ్రైవర్

బతుకే భారం



డిగ్రీ, పీజీలు చేసినా ఉద్యోగాలు రాకపోడంతో బతుకే భారంగా మారింది. కష్టపడి చదివించిన తల్లిదండ్రుల శ్రమకు తగిన ఫలితం దక్కడంలేదు. కుటుంబానికి భరోసాగా నిలవాల్సిన యువత భారంగా మారింది. ప్రభుత్వశాఖల్లో లక్షలాది కొలువులు ఖాళీగా ఉన్నా వాటిని భర్తీ చేద్దామన్న ఇంగితజ్ఞానం ప్రభుత్వానికి లేకుండాపోయింది. ప్రతి సంక్రాంతికి జాబ్ క్యాలెండర్ ఆశచూపి ఐదేళ్లైనా విడుదలచేయలేదు. కనీసం పరిశ్రమలైనా తీసుకువచ్చిన పాపాన పోలేదు. డీఎస్సీ నోటిఫికేషన్, ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీచేసే ప్రభుత్వం వస్తేనే యువతకు ఉద్యోగాలొస్తాయి.


- బాలకృష్ణ, నిరుద్యోగి

- అనంతపురం సెంట్రల్

ఐదేళ్లలో వివిధ పేర్లతో వడ్డన... నేటికి కొనసాగుతున్న బాదుడు
పెరిగిన బిల్లులతో లబోదిబోమంటున్న జనం

విద్యుత్ చార్జీల మోత..!

అనంతపురంరూరల్, ఏప్రిల్ 25: ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మాటలకు చేతలకు పొంతన ఉండడం లేదు. గత ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని జగన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఎడాపెడా విద్యుత్ చార్జీలు పెంచేశారు. ఒక్కసారి రెండు సార్లు కాదు..ఐదేళ్లలో వివిధ పేర్లలో జనం నెత్తిన విద్యుత్ చార్జీల మోత మోగిస్తూనే ఉన్నారు. ప్రతి నెలా విద్యుత్ బిల్లులు పరిశీలిస్తే బాదుడు ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. వినియోగించిన కరెంటుకు బిల్లుకు ఏమాత్రం పొంతన ఉండటం లేదు. దీంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు విద్యుత్ బిల్లులు మోయలేని భారంగా మారాయి. చార్జీల పేరిట మరోసారి జనం నుంచి దండుకోవడం ప్రారంభించారు. అదనపులోడు మాటునా ముక్కు పిండి వసూలు చేశారు. ఇలా వినియోగదారుల నుంచి వివిధ పేర్లతో విద్యుత్ చార్జీలు వసూలు చేస్తున్నారు. వాటితోపాటు ఫిక్స్‌డ్ చార్జీల పేరిట రూ.10, కస్టమర్ చార్జీల పేరిట రూ.45, ఎలక్ట్రిసిటీ చార్జీల పేరుతో రూ.5.65, ఎఫ్‌పీపీసీ



కొత్తకొత్త పేర్లతో చార్జీల బాదుడు

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొత్త..కొత్త పేర్లతో జనంపై విద్యుత్ చార్జీల మోత మోగించింది. మొదట్లో ఉన్న స్లాబులు మార్చి విద్యుత్ చార్జీలను పెంచింది. తరువాత ట్రూఅప్ చార్జీల పేరిట 2014-15 నుంచి 2018-19 మధ్యకాలంలో వినియోగించిన విద్యుత్‌కు చార్జీలు వసూలు చేయడం మొదలు పెట్టింది. తరువాత ఇందన సర్దుబాబు చార్జీల పేరుతో దాదాపురూ.35నుంచి రూ.40 ప్రతి నెలా వసూలు చేస్తున్నారు. అదే విధంగా సర్‌చార్జీల పేరిట రూ.25 వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రతినెలా రూ.150 అదనంగా వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారు. ప్రతి నెలా బిల్లులు చూసి వినియోగదారులు లబోదిబోమంటున్నారు.

ఈ స్థాయిలో బాదుడు ఎన్నడూ లేదు



ఈ ఐదేళ్లలో విద్యుత్ చార్జీలు పెరిగిన విధంగా ఎన్నడూ చూడలేదు. నెల నెల వందల..వందలు కరెంటు బిల్లు వస్తోంది. ఇంట్లో ఏమైనా కరెంటు వస్తువులు పెరిగాయా అంటే అదీ లేదు. ఈ కరెంటు బిల్లు బాదుడు తట్టుకోలేక ఎండకాలం వచ్చినా కూలర్ ఉన్నప్పటికీ వాడకుండా ఎగపెట్టేశాం. మాలాంటి మధ్య తరగతి కుటుంబాలకు విద్యుత్ బిల్లులు భారంగా మారాయి.

- రామాంజనేయులు, పాపంపేట, అనంతపురం

సగానికి పైగా పెరిగింది



గతంలో మా ఇంటికి ప్రతి నెల రూ.200 నుంచి రూ.250 మధ్య కరెంటు బిల్లు వచ్చేది. ఇప్పుడైతే ఏకంగా రూ.500 దాటుతోంది. సగానికి సగం కరెంటు బిల్లు పెరిగింది. ట్రూఅప్, ఫిక్స్‌డ్ చార్జీలంటూ బిల్లులో చాలానే ఉంటున్నాయి. కరెంటు వాడినదానికంటే అదనంగా వేస్తున్న చార్జీలే ఎక్కువగా ఉంటున్నాయి. ఇంత అధ్వాన్న పరిస్థితి గతంలో ఎప్పుడూ చూడలేదు.

- సాకే బ్రహ్మయ్య, జ్యోతిబసుకాలనీ, అనంతపురం

అడుగుకో గుంత..
ప్రయాణమంటే చింత!

గడచిన ఐదేళ్లలో గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. అడుగుకో గుంత ఏర్పడ్డాయి. వాటికి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయకపోవడంతో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. దీనికి ఉదాహరణే గార్లదిన్నె నుంచి మర్తాడు మీదుగా కోటంక వెళ్లే రోడ్డు. ఈ రోడ్డు సుమారు 10 కిలో మీటర్లు పొడవునా గుంతలమయమైంది. ఈ రోడ్డుపై ప్రయాణించే సమయంలో ఏమాత్రం అప్రమత్తంగా లేకున్నా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. రాత్రి సమయంలో అయితే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిందే. ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం కోటంక గ్రామ సమీపంలోనే ఉంది. దేవాలయానికి ప్రతి ఆదివారం వందలాది మంది భక్తులు వస్తుంటారు. ప్రతి ఏడాది మాఘమాసంలో నిర్వహించే ఉత్సవాలకు జిల్లా నుంచి కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు వస్తుంటారు. అయితే గుంతమయమైన రోడ్డు ప్రయాణంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని వారంత ఆందోళన చెందుతున్నారు. అధికార పార్టీ నాయకులు, అధికారులు పట్టించుకోకపోవడంతోనే సమస్య జటిలమైందని ఆయా గ్రామాల ప్రజలు, భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- గార్లదిన్నె



గుంతలమయమైన మర్తాడు రోడ్డు

టీడీపీ వస్తేనే.. రూ.5 భోజనం



నిరుపయోగంగా ఉన్న అన్న క్యాంటిన్

మడకశిరటౌన్, ఏప్రిల్ 25: స్థానిక అమరాపురం రోడ్డులో ఉన్న అన్న క్యాంటిన్ నిరుపయోగంగా మారింది. టీడీపీ పాలనలో ఎంతోమంది ఆకలి తీర్చిన ఈ క్యాంటిన్ వైసీపీ ప్రభుత్వ తీరుతో మూతపడింది. తహసీల్దార్ కార్యాలయం, రిజిస్ట్రేషన్ల కోసం, కోర్టు పనులు ఇతరత్ర వ్యవహారాల మీద ఎంతో మంది ఐదు మండలాల నుంచి మడకశిరకు వచ్చేవారు. వారిలో చాలా మంది మధ్యాహ్నం వేళ అన్న క్యాంటిన్‌లోనే భోజనం చేసేవారు. కేవలం రూ.5లకే రుచికరమైన భోజనం లభిస్తుండటంతో గ్రామంలోని పేదలు సైతం ఇక్కడే తినేవారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నన్ని రోజులు అన్నా క్యాంటిన్ ఎంతో మంది పేదల ఆకలి తీర్చింది. రాష్ట్రంలో అధికారం మారడంతో అన్న క్యాంటిన్‌లు మూతపడ్డాయి. దీనిపై అప్పట్లోనే తీవ్ర విమర్శలు వచ్చాయి. టీడీపీ అధికారంలోకి వస్తేనే మళ్లీ అన్న క్యాంటిన్ వస్తాయని ప్రజలు అంటున్నారు.

పార్టీ ఏదైనా.. ప్రచారానికి ఓకే..!



ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి మందుబాబుల్లో సందడి నెలకొంది. ప్రతి రోజూ వారికి పండుగే. మద్యం అందిస్తే చాలు.. పార్టీతో పని లేదు. ఏ పార్టీకైనా ప్రచారం చేసేస్తున్నారు. వారే ముందుడి ప్రచారాన్ని తీసుకెళ్తున్నారు. రోజుకోపార్టీకి ప్రచారం చేస్తున్నారు, మరికొంత మంది మందు బాబులు ఉదయం ఓపార్టీతో సాయంత్రం మరోపార్టీతో కలిసిపోతున్నారు. మద్యం పుష్కలంగా ఉచితంగా దొరుకుతుండటంతో మందుబాబులకు కిక్కు దిగడం లేదు. ఉచితంగా మద్యం దొరుకుతుండటంతో అలవాటు లేని వారు సైతం మందు తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు.

- మడకశిర రూరల్

టీడీపీ సానుభూతిపరురాలని..

అభాగ్యురాలికి పింఛన్ ఏది



పెన్షన్‌రాని అభాగ్యురాలు అంజినమ్మ

రొద్దం, ఏప్రిల్ 25: మండలంలోని ఉప్పర్లపల్లి గ్రామానికి చెందిన అంజినమ్మ భర్త చనిపోయి ఏడాదైనా పింఛన్ ఇవ్వనీకుండా వైసీపీ నాయకులు అడ్డుపడుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉప్పర్లపల్లి గ్రామానికి చెందిన అంజినమ్మ భర్త మల్లప్ప అనారోగ్యంతో మృతి చెందాడు. ఆమె టీడీపీ సానుభూతిపరురాలని వలంటీర్లు, స్థానిక వైసీపీ నాయకులు పింఛన్ రాకుండా అడ్డుకున్నారన్న విమర్శలు ఉన్నా యి. అరవై ఏళ్ల వృద్ధురాలైన ఆమె మూడు నెలల కిందట జారి పడటంతో కాలువిరిగి దివ్యాంగురాలైంది. ఈక్రమంలో పింఛన్ కోసం ఎన్నోమార్లు అధికారులు, వలంటీర్లకు విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. కుల, మతాలు, పార్టీలకతీతంగా పెన్షన్ ఇస్తామని చెబుతున్న ప్రభుత్వ పెద్దలు దీనికేమంటారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.


చెక్‌పోస్టు పడింది

సరిహద్దుల్లో మూతపడిన చెక్‌పోస్టులు



గౌడనహళ్లి గ్రామ సమీపంలో మూతపడిన చెక్‌పోస్టు

మడకశిర రూరల్ ఏప్రిల్ 25: వైసీపీ పాలనలో సరిహద్దుల్లో మద్యం అక్రమ రవాణాకు గేట్లు ఎత్తేశారనే విమర్శలు వినవస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజుల్లో మద్యం, ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో తనిఖీలు చేయడంకోసం చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మండలంలోని సరిహద్దు గ్రామాల్లో ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, వాటికి విద్యుత్ సౌకర్యం కల్పించారు. సీసీ కెమేరాలు కూడా ఏర్పాటు చేశారు. నిధుల కొరతతో ఏడాది తిరగకముందే చెక్‌పోస్టులు ఎత్తివేశారు. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యింది. ప్రస్తుతం ఎన్నిల సమయం కావడంతో కర్ణాటక నుంచి వివిధ మార్గాల్లో మద్యం అక్రమంగా ఆంధ్రలోకి జోరుగా రవాణా అవుతోంది. దీంతో గ్రామాల్లో కర్ణాటక మద్యం ఏరులై పారుతోంది. కాగా కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై గట్టి చర్యలు తీసుకోనున్నట్లు సెబ్ సీఐ ధీరజ్‌రెడ్డి తెలిపారు.



గ్రామాల్లో సేవించి పారేసిని కర్ణాటక మద్యం ప్యాకెట్లు

నచ్చిన వాళ్లకు ఓటేసేవాళ్లం



నేను యుక్త వయసులో ఉండగా ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు జరిగాయి. అప్పుడు ఎమ్మెల్యేగా పోటీ చేసేవారు గ్రామాలకు గ్రామ పెద్దలను కలిసేవారు. మద్దతు కోరేవారు. అయితే మాకు ఏ అభ్యర్థి నచ్చితే వారికి ఓటు వేస్తాం అని నిర్మొహమాటంగా గ్రామ పెద్దలు చెప్పేవారు. ఇప్పటిలా ఓటును డబ్బుకు, మందుకు అమ్ముకునే వాళ్లం కాదు. ఎన్నికల రోజు గ్రామ పెద్దలు ఉగ్గని పెట్టేవారు. ఉగ్గని తిని ఎద్దుల బండిలో వెళ్లి ఓటు వేసి వచ్చేవాళ్లం.

- బత్తలపల్లి

ఇప్పటి దాకా ఆ పార్టీకే ఓటు




మొదటి నుంచి కూడా బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందించే పార్టీకే ఓటు వేస్తూ వచ్చాం. నాకు ప్రస్తుతం 70 సంవత్సరాలు. 1983లో ఎన్టీఆర్ పార్టీ పెట్టి రాష్ట్రంలో పేదలకు సంక్షేమ పథకాలు తీసుకొచ్చాడు. దాన్ని మేమంతా గొప్పగా భావించాం. అందుకే అప్పటి నుంచి టీడీపీకే ఓటు వేస్తున్నాం. వైసీపీ వాళ్ల పింఛన్ విషయంలో వృద్ధులను మోసం చేశారు. చంద్రబాబు వస్తే నెలకు రూ.4వేలు ఇస్తానని చెబుతున్నాడు. వృద్ధుల పట్ల శ్రద్ధ చూపేవారికే ఓటు వేస్తాం. పింఛన్ పెంచుతానని చెబుతున్నారు కాబట్టి ఈ సారి మాలాంటి వృద్ధులతో పాటు, దివ్యాంగులు, వితంతువుల ఓట్లు టీడీపీకే పడతాయి.

- శింగనమల

కొత్త కొత్తగా...

తొలిసారి ఓటేయనున్న 5973 మంది



ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో యువ ఓటర్లు వేల సంఖ్యలో పెరిగారు. వారంతా తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోను న్నారు. గుంతకల్లు నియోజకవర్గంలో 18-19సంవత్సరాలు కలిగిన దాదాపు 5973 మంది యువ ఓటర్లుగా నమోదయ్యారు. వీరంతా విజన్ ఉన్న నాయకుడు, సంపద, ఉపాధి, ఉద్యోగాలు సృష్టించి యువత భవితకు గ్యారెంటీ ఇచ్చే నాయకుడిని ఎన్నుకోవడానికి సిద్ధమైనట్లు చెబుతున్నారు. నియోజకవర్గం అభివృద్ధి చేసే పార్టీకే ఓటు వేస్తామని ముక్త కంఠంతో చెబుతున్నారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గమని, బాధ్యతగా, ప్రజాస్వామ్యం పట్ల నమ్మకంతో ఓటు వేస్తామని చెబుతున్నారు.

- గుంతకల్లుటౌన్

చేనేత వరం

ప్రపంచ ఖ్యాతిగాంచిన ధర్మవరం పట్టుపరిశ్రమ

- అద్భుత కళాసృష్టికి కొదవలేదు
- నిమ్మలకుంట తోలుబొమ్మలకు అంతర్జాతీయ గుర్తింపు
- అభివృద్ధి లేక కుదేలు
- మహిళా ఓటర్లే అధికం



చేనేత మగ్గం నేస్తున్న కార్మికుడి విగ్రహం



అగ్గిపెట్టెలో చీర చుట్టి అపార కీర్తిని దోసిటపట్టిన జగజ్జెట్టి ధర్మవరం చేనేత కార్మికుడు. ధర్మవరం అంటేనే చేనేత పరిశ్రమ గుర్తుకు వస్తుంది. చేనేతకు వరంగా ఖ్యాతిగాంచింది. వేలాది మంది కార్మికులు చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. అదేస్థాయిలో చేనేత కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని మగ్గం గుంతలో మగ్గుతున్నా వారి బతుకుల్లో వెలుగులు నింపే నాథుడే లేడు. రానురాను ఆధునిక పోకడలతో కార్మికులు జీవనోపాధిని కోల్పోయే పరిస్థితులు దాపురించాయి. ధర్మవరం మండలంలోని నిమ్మలకుంట తోలుబొమ్మలకు సైతం అంతర్జాతీయ గుర్తింపు లభించింది.

ధర్మవరం

ధర్మవరం పేరెత్తగానే టక్కున గుర్తు వచ్చేది పట్టుచీరలు. ఇక్కడ చీరల తయారీలో కార్మికుల కళా నైపుణ్యానికి కొదవలేదు. అగ్గిపెట్టెలో ఒదిగేలా పట్టుచీరలు తయారు చేసిన నేతన్న సంపంగి, మయూరా, పద్మారవింద వంటి ఎన్నో సృజనాత్మకతతో కూడిన పట్టువస్త్రంపై తమ కళానైపుణ్యంతో మగువ మెచ్చేలా తయారు చేయడంలో ఇక్కడి నేత కార్మికుల సొంతం. ఇక్కడ తయారు చేసిన పట్టుచీరలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. పేరుకే గుర్తింపు ఉంది కానీ ఆ నేతన్నలు కడుపు మాత్రం నింపలేని పరిస్థితి పట్టుపరిశ్రమలో నెలకొంది. కనీస ధర కూడా లేకపోవడంతో నేతన్నలు పడుతున్న బాధలు వర్ణణాతీతమే. చేనేత తరువాత వ్యవసాయంపై కూడా ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో ఆధారపడి జీవిస్తున్నారు. నాయకులు ఈ రెండు రంగాలను పెద్దగా పట్టించుకోలేదని విమర్శలు ఉన్నాయి. నియోజకవర్గంలో చెరువులు నిండినా ఆయకట్టు భూములు మాత్రం సాగులోకి రాకపోవడం ఇక్కడి రైతాంగాన్ని కుంగదీస్తోంది. గత ఏడాది నుంచి తాగునీరు కూడా ధర్మవరానికి ప్రధాన సమస్యగా మారింది. డంపింగ్ యార్డ్ లేక ఎక్కడపడితే అక్కడ చెత్తను వేసే పరిస్థితి మున్సిపాలిటీలో ఏర్పడింది.

ధర్మవరానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే...

శ్రీకృష్ణదేవరాయల కాలంలో సామంతరాజులుగా ఉన్న క్రియాశక్తి వడియార్ అప్పట్లో వర్షాలు బాగా వస్తున్నా నీరు నిల్వ ఉండేందుకు బావులు పెద్దగా లేకపోవడంతో ధర్మవరం చెరువును తవ్వించారు. చెరువుకు ఏడు మరువలు పెట్టారు. ఒకసారి భారీ వర్షం కారణంగా ఏడు మరువలు పొంగి పొర్లుతున్నాయి. మరువలు తెగిపోతే చాలా గ్రామాల్లోని ప్రజలు నీటమునిగి పోతారని తెలుసుకున్న చెందిన ధర్మాంబ అనే మహిళ మరువ వద్ద కట్ట తెగిపోకుండా ఉండేందుకు ఆమె అడ్డంగా పడుకుని ప్రాణత్యాగం చేసింది. అప్పుడు గంగమ్మ శాంతించి మరువలు తెగిపోలేదని పురాణాలు చెబుతున్నాయి. చెరువు మరువలు తెగిపోకుండా ప్రాణత్యాగం చేసిన ధర్మాంబ అనే మహిళ పేరును పెట్టారు. కాలక్రమేనా ధర్మాంబ పేరు ధర్మవరంగా మారిందని పెద్దలు చెబుతున్నారు.

ప్రముఖ పుణ్యక్షేత్రాలు

ధర్మవరం పట్టణంలో చెన్నకేశవుడి రథోత్సవాలు పది రోజులపాటు అంగరంగ వైభవంగా జరుగుతాయి. తాడిమర్రి మండలంల మహాశివరాత్రికి చిల్లవారిపల్లి కాటకోటేశ్వరక్షేత్రంలో ఉత్సవాలు కూడా వైభవంగా నిర్వహిస్తారు. బత్తలపల్లి మండల కేంద్రంలో మొహరం వేడుకలలో భాగంగా పీర్ల స్వాముల భేటీ కార్యక్రమాన్ని కూడా ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ఈ వేడుకలకు భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారు. ముదిగుబ్బమండలంకమ్మవారిపల్లి గ్రామంలో వీరనారాయణస్వామి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి.



చెన్నకేశవ స్వామి



కాట కోటేశ్వరుడు



బత్తలపల్లిలో పీర్ల భేటీ

రాజకీయ చరిత్ర

ఉమ్మడి అనంతపురం జిల్లాలో భాగమైన ధర్మవరం మద్రాసు రాష్ట్రం ఉన్నప్పుడే నియోజకవర్గంగా ఏర్పడింది. నియోజకవర్గ విస్తీర్ణం 1,33,361 హెక్టార్లు ఉండగా, 3,04706 జనాభా ఉంది. ఇందులో పురుషులు 1,55,211 మంది, మహిళలు 1,49,495 మంది ఉన్నారు. జిల్లాల పునర్విభజన తరువాత పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లాగా అవతరించి ధర్మవరం నియోజకవర్గం ఆ జిల్లాలో భాగమైంది. ఇప్పటి వరకు 15 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 1951లో నియోజకవర్గం ఏర్పాటుకాగా 1952లో మొదటిసారి అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ తరఫున ధర్మవరం పట్టణానికి చెందిన కాశెట్టి శ్రీనివాసులు గెలుపొందారు. ఈయన తన ప్రత్యర్థిపై 16,072 ఓట్లమెజారిటీతో గెలుపొంది మొట్టమొదటి ఎమ్మెల్యేగా సుస్థిర స్థానాన్ని పొందారు. ఎంతో మంది ఎమ్మెల్యేలుగా, జిల్లా పరిషత్ ఛైర్మన్లుగా, రాష్ట్ర మంత్రులుగా, పీసీసీచీఫ్, ఎమ్మెల్సీలుగా ప్రాతినిధ్యం వహించిన ఘన చరిత్ర ఉంది. 1983లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసిన గరుడమ్మగారి నాగిరెడ్డి 30,605 ఓట్ల అత్యధిక మెజార్టీ సాధించారు. 1994లో టీడీపీ తరఫున పోటీచేసిన గుత్తా వెంకటనాయుడు 1070 అత్యల్ప మెజారిటీ సాధించారు.

ప్రభావితం చేసే అంశాలు

ధర్మవరంలో పలు అంశాలు ఎన్నికలను ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇక్కడ ప్రధానంగా చేనేత వృత్తిని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్నారు. వీరిపై ఎటువంటి ఇబ్బంది కల్గించిన వారి నుంచి తీవ్ర ప్రభావంచూపే అవకాశం లేకపోలేదు. రైతులకు కూడా సరైన సమయంలో సరైన సహకారం అందించకపోతే ఆ ప్రభుత్వంపై అసంతృప్తి రాగాలు పెల్లుబుకే అవకాశం ఉంటుంది. దీంతో పాటు పింఛన్లు, రోడ్ల సమస్యలపై ప్రజలు అసంతృప్తిని వెళ్లగక్కనున్నారు. తాగు, సాగు నీరు కూడా సక్రమంగా అందించకపోతే రైతుల ఆగ్రహాన్ని చవిచూడాల్సిన పరిస్థితి ఇక్కడ ప్రధానంగా నెలకొంటుంది. ఇక్కడ ఎవరైనా కబ్జాలు, భూదందాలు, అవినీతికి పాల్పడిన ఆ పార్టీకి ఓటు బ్యాంకు రూపంలో ఇబ్బందికరంగా మారే పరిస్థితి ఉంటుంది.

తొలి ఎమ్మెల్యే కాశెట్టి శ్రీనివాసులు

ధర్మవరం నియోజకవర్గం తొలి అసెంబ్లీ అభ్యర్థిగా 1952లో కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ తరఫున పోటీ చేసిన కాశెట్టి శ్రీనివాసులు తమ సమీప ప్రత్యర్థి కాంగ్రెస్‌కు చెందిన జి.వెంకటరెడ్డిపై 16,056 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కాశెట్టి శ్రీనివాసులు మగ్గం నేసుకుంటూ అప్పటి ధర్మవరం ప్రజల అభీష్టం మేరకు పోటీ చేసి విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఆయన గెలుపొందిన తరువాత తమకున్న ఆస్తులను సైతం ప్రజాఉపయోగ కార్యక్రమాలకు కేటాయించారని ఇప్పటికి స్థానికులు చెబుతుంటారు. ప్రస్తుతం వీరి కుటుంబం మొత్తం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లింది. మగ్గంతోపాటు చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవారు. ప్రస్తుతం ఆ కుటుంబం ఆయనతోనే రాజకీయాలకు స్వస్తిపలికినట్లయింది.

నియోజకవర్గ ప్రత్యేకత

ధర్మవరం నియోజకవర్గం ఏర్పడిన తరువాత 15 సార్లు ఎన్నికలు నిర్వహించగా ఇందులో తెలుగుదేశం ఆరుసార్లు, కాంగ్రెస్ ఆరుసార్లు, వైపీపీ ఒకసారి, ఇండిపెండెంట్ ఒకసారి, కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ ఒకసారి గెలుపొందాయి. ఇందులో అత్యధికం, అత్యల్ప మెజార్టీలు టీడీపీ అభ్యర్థులకే దక్కాయి. గరుడమ్మగారి నాగిరెడ్డి ఒక్కరే మూడు సార్లు గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. ఈయన తెలుగుపార్టీ ఆవిర్భావం నుంచి 1983 నుంచి వరుసగా మూడు సార్లు గెలుపొంది మంత్రిగా పనిచేశారు. ధర్మవరం చేనేత పరిశ్రమకు, నిమ్మలకుంట తోలుబొమ్మలకు ప్రపంచ ప్రఖ్యాతి గాంచడం ఈ నియోజకవర్గంలో ప్రత్యేకతను చాటుకుంది.

సంవత్సరం	విజేత	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	ఆధిక్యం
1952	కాశెట్టి శ్రీనివాసులు	కేఎంపీపీ	జి.వెంకటరెడ్డి	కాంగ్రెస్	16,056
1955	పి.రామాచార్యులు	కాంగ్రెస్	బీటీ పక్కీరప్ప	సీపీఐ	24,149
1962	పీవీ చౌదరి	కాంగ్రెస్	ఎల్.నారాయణప్ప	ఇండిపెండెంట్	2,939
1967	పల్లెం వెంకటేశ్	స్వతంత్రపార్టీ	పీవీ చౌదరి	కాంగ్రెస్	3,260
1972	పీవీ చౌదరి	కాంగ్రెస్	జి.అనంతరెడ్డి	ఇండిపెండెంట్	2,307
1978	గోనుగుంట్ల అనంతరెడ్డి	కాంగ్రెస్	సీసీ లక్ష్మీనారాయణరెడ్డి	జనతా	13,177
1983	జి.నాగిరెడ్డి	టీడీపీ	పీవీ చౌదరి	కాంగ్రెస్	30,605
1985	జి.నాగిరెడ్డి	టీడీపీ	జి.పెద్దారెడ్డి	కాంగ్రెస్	12,071
1989	జి.నాగిరెడ్డి	టీడీపీ	జి.నారాయణస్వామి	కాంగ్రెస్	40,421
1994	గుత్తా వెంకటనాయుడు	టీడీపీ	కె.సూర్యప్రతాప్‌రెడ్డి	ఇండిపెండెంట్	1070
1999	కె.సూర్యప్రతాప్‌రెడ్డి	కాంగ్రెస్	జి.విజయ్‌కుమార్	టీడీపీ	8,660
2004	జి.జయలక్ష్మమ్మ	టీడీపీ	జి.నాగిరెడ్డి	సీపీఐ	3,787
2009	కె.వెంకటరామిరెడ్డి	కాంగ్రెస్	జి.సూర్యనారాయణ	ఇండిపెండెంట్	19,172
2014	జి.సూర్యనారాయణ	టీడీపీ	కె.వెంకటరామిరెడ్డి	వైసీపీ	14,911
2019	కె.వెంకటరామిరెడ్డి	వైసీపీ	జి.సూర్యనారాయణ	టీడీపీ	15,826

ప్రధాన సమస్యలు

ధర్మవరం మండలంలో నడిమిగడ్డిపల్లి, బిల్వంపల్లి, చిగిచెర్ల ఎస్సీకాలనీ, గరుడంపల్లి, సుబ్బరావుపేట, నేటకోట గ్రామాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. తాగునీటి కోసం సమీప వ్యవసాయ బోరుబావుల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. రాంపురం-ధర్మవరం, ముచ్చురామి-రేగాటిపల్లి, ధర్మవరం నుంచి తుమ్మల,తిప్పేపల్లి గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయి. తాడిమర్రి నుంచి ఏకపాదంపల్లి, పుల్లప్పల్లి నుంచి పిన్నధరి, దాడితోట బైపాస్ నుంచి నాయనపల్లి, పార్నపల్లి నుంచి తురకవారిపల్లి గ్రామాల రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయి. చిల్లవారిపల్లి, చిల్లకొండయ్యపల్లి, శివంపల్లి బీసీకాలనీ తాగునీటి సమస్య ఉంది. చిల్లవారిపల్లి గ్రామంలో ప్రజలు బాటమ్మగుడి వద్దకు, వ్యవసాయ పొలాల వద్దకు తాగునీటి కోసం వెళుతున్నారు. చిల్లకొండయ్యపల్లిలో ఒక కిలోమీటరు దూరంలో ఉన్న మరోకాలనీకి వెళ్లి నీటిని తెచ్చుకుంటారు. ఈ ఏడాది చెరువులకు నీరు రాకపోవడంతో సాగునీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముదిగుబ్బ మండల కేంద్రంలోని పాతవూరు తాగునీటి సమస్య అధికంగా ఉంది. దీంతో ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. నల్లాయగుంటపల్లి, యాకర్లకుంటపల్లి, గుంజేపల్లి, పొడరాళ్లపల్లి, సంకేపల్లి గ్రామాల సమీపంలో వ్యవసాయ బావులకు లో ఓల్టేజ్ సమస్య అధికంగా ఉంది. యోగివేమన రిజర్వాయర్ వద్దకు వెళ్లే రహదారి అధ్వాన్నంగా ఉంది. టీకొట్టాలకు వెళ్లే రహదారి కూడా కంకర తేలి నడవడానికి కూడా ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. బత్తలపల్లి మండలంలో అనంతసాగరం, కాటమకుంట, దంపెట్ల పంచాయతీ, పత్యాపురం, చెర్లోపల్లి గ్రామాలలో తాగునీటి సమస్య ఉంది. ఉప్పర్లపల్లి క్రాస్ నుంచి గరిశనపల్లివరకు రోడ్డు గుంతలమయంగా ఉండటంతో ఆ గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



తోలుబొమ్మలను తయారు చేస్తున్న కళాకారుడు

నిమ్మలకుంట తోలుబొమ్మతో అంతర్జాతీయ ఖ్యాతి

ధర్మవరం అంటేనే చేనేత పరిశ్రమ తరువాత విదేశాల్లో సైతం గుర్తింపు పొందిన కుగ్రామం నిమ్మలకుంట. ఈ గ్రామం తోలుబొమ్మలకు ప్రఖ్యాతిని పొందింది. తెల్లస్క్రీన్‌పై వెనుక వైపు నుంచి తోలుబొమ్మలను ఆడిస్తూ జీవనం పొందుతున్న ఆ కళాకారులు ప్రత్యేక ఆకృతులతో కూడిన గృహోపకరణాలు వంటి వస్తువులు కూడా తయారుచేసి విదేశాలలో క్రయవిక్రయాలు నిర్వహిస్తూ గుర్తింపు పొందారు. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డులను సైతం సొంతం చేసుకున్నారు. రామాయణం, రామాంజనేయయుద్ధం వంటి చిత్రాలు తోలు చర్మంపై చిత్రీకరించడం వారి కళానైపుణ్యానికి నిదర్శనం. డాక్టరేట్ల నుంచి రాష్ట్రపతి అవార్డుల వరకు కళాకారులు సొంతం చేసుకున్నారు.

ఎవరు కావాలో ఆలోచించండి..!

మాదిగ కుల సంఘాల ఐక్య కూటమి

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 25: మాదిగలకు హక్కుగా అందాల్సిన సంక్షేమ పథకాలను రద్దుచేసిన సీఎం జగన్, ఐదేళ్ల నుంచి ఆ వర్గ ప్రజలను రోడ్డున పడేశారని మాదిగ కుల సంఘాల ఐక్య కూటమి నాయకులు మండిపడ్డారు. భవిష్యత్తులో జగన్ కావాలో సంక్షేమాన్ని అందించిన చంద్రబాబు కావాలో విజ్ఞతగా ఆలోచించాలని మాదిగలకు సూచించారు. ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప అధ్యక్షతన పెన్షర్ల భవన్‌లో మాదిగ కుల సంఘాల ఐక్య కూటమి సమావేశాన్ని గురువారం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌జే ప్రకాష్, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు, జైమాదిగ సేవా సంఘం రాష్ట్ర వ్యవస్థాపకులు బెంజిమన్, మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్, నవ్య చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, బేడ, బుడగ జంగం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వర రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలతో మాదిగలపై దౌర్జన్యకాండ సాగిందని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ చేసి సంక్షేమ పథకాలను అమలుచేసే నారా చంద్రబాబునాయుడిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వర్గీకరణ హామీ పత్రాలను ఆవిష్కరించారు.



ఐక్యత ప్రకటిస్తున్న నాయకులు

పోలింగ్ రోజు ఏజెంట్లే కీలకం

ముదిగుబ్బ, ఏప్రిల్ 25: ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రాల్లో అభ్యర్థుల తరఫున పరిశీలనకు కూర్చునే ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకం. అభ్యర్థులు నెలల తరబడి నిర్వహించిన ప్రచారం, ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పడిన కష్టానికి ఫలితం ఇచ్చేది పోలింగ్ కేంద్రమే. అటువంటి కేంద్రంలో పోలింగ్ సక్రమంగా జరుగుతుందా? లేదా అన్నది గమనించడం, బోగస్ ఓట్లు పడకుండా ఓటు వేయడానికి వచ్చినవారిని నిశితంగా పరిశీలించడం ఏజెంట్ల పని. గుర్తింపు పొందిన, రిజిస్టర్డ్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల తరఫున ప్రాధాన్య క్రమంలో ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల్లో కూర్చుంటారు. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి కదలిక ఏజెంట్ నిశితంగా పరిశీలించాలి. ఏమాత్రం అనుమానం వచ్చిన ఏజెంట్ తన అభ్యంతరాన్ని ప్రీసైడింగ్ అధికారికి తెలపవచ్చు. ఎంతో కీలకమైన ఈ ఏజెంట్‌గా అభ్యర్థులు తమకు నమ్మకమైనవారిని కూర్చోబెడతారు. ఏజెంట్ ఏమాత్రం తప్పు చేసినా ఆ పార్టీ అభ్యర్థికి నష్టమే కలుగుతుంది.



ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి



ఎనుమలపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



గొట్లూరులో..

- పీహెచ్‌సీ వైద్యాధికారిణి సూచన
- మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 25: ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించి ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ జ్యోత్స్న సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆమె వైద్యసిబ్బందితో కలిసి మలేరియా నివారణపై ప్రధాన వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దోమ పుట్టకూడదు, దోమ కుట్టకూడదు, చిన్నదోమ పెనుప్రమాదం, దోమతెరలు వాడండి అంటూ నినాదాలు చేశారు. అనంతరం వైద్యాధికారిణి మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యవంతమైన జీవనం గడపాలన్నారు. ఇక పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. సాయంత్రం సమయంలో వేపాకు పొగ వేసి దోమలను నివారించాలన్నారు. దోమల వల్ల మలేరియా, డెంగీ జ్వరాలు వస్తాయన్నారు. కావున దోమల భారిన పడకుండా జాగ్రత్త వహించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నగేష్, పీహెచ్ఎన్ లలితకుమారి, ఎస్‌యూఓ రమణయ్య, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: మండలంలోని గొట్లూరు గ్రామంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని దర్శినమల పీహెచ్‌సీ వైద్యాధికారిణి పుష్పలత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలు మలేరియా భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమపుట్టకూడదు- దోమ కుట్టకూడదని, వేపాకు పొగ-దోమలకు సెగ అంటూ నినాదాలు చేశారు. మలేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్లు రాజశేఖర్‌రెడ్డి, జైతున్‌బీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో డాక్టర్ గణేనాయక్ ఆధ్వర్యంలో మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం నుంచి బస్టాండు కూడలి వరకు మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి దోమల నివారణపై నినాదాలు చేశారు. తర్వాత వైద్యులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలను నివారించాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. సీహెచ్‌ఓ రామాంజి , సూపర్‌వైజర్లు, మంజుల, రామచంద్ర, ఎంపీహెచ్ఎస్ మహబూబ్ బాషా, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యులు భానుప్రకాశ్‌నాయక్, కమల్‌రోహిత్ ఆధ్వర్యంలో సిబ్బంది మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వైద్యులు, వైద్య సిబ్బంది మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం చేపట్టారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ వరుసగా మూడు రోజులుగా జ్వరం వచ్చిందంటే మలేరియా అని నిర్ధారించవచ్చన్నారు. ఎవరూ మలేరియా భారిన పడకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు బాబాఫక్రుద్దీన్, సిబ్బంది విజయ్‌కుమార్, సూపర్‌వైజర్ ఉపేంద్రరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన

- ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి



తలమర్లలో ప్రచారం నిర్వహిస్తున్న పల్లె

కొత్తచెరువు, ఏప్రిల్ 25: చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని, ఆయన సీఎం అయితేనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తలమర్ల పంచాయతీలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డిని, ఎంపీగా బీకే పార్థసారథిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించి .. వాటి వల్ల కుటుంబంలోని అన్ని అందరికీ లబ్ధి చేకూరుతుందని తెలిపారు. చంద్రబాబు సీఎం అయిన వెంటనే ఆ పథకాలను అమలు చేస్తారని చెప్పారు. తర్వాత మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి బ్యాంకులు, తాగునీరు, భూ దోపిడి చేస్తూ అటు వ్యవస్థలను, ఇటు ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇలాంటి అవినీతి ఎమ్మెల్యేను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ అభివృద్ధి గురించి ఎమ్మెల్యే ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. బ్యాంకులు, ప్రజలకు అందాల్సిన సత్యసాయితాగునీటిని దోచుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. డబ్బు కోసం సొంత పార్టీ ఎంపీపీతోనే కప్పం కట్టించుకున్నది వాస్తవం కాదా అని నిలదీశారు. ఐదేళ్లలో నియోజకవర్గంలో ఒక్క చెరువును కూడా నింపని ఎమ్మెల్యే.. ఎన్నికలు వచ్చే సరికి 193 చెరువులకు నీరందిస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్యే ఆగడాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చేఎన్నికల్లో ఓటుతో తగిన బుద్ధి చెబుతారని అన్నారు. టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే ఎవరినీ ఉపేక్షించమని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

యర్రవంక పల్లిలో ఎన్నికల ప్రచారం



యర్రవంకపల్లిలో పల్లె వెంకట కృష్ణ కిశోర్ ప్రచారం

నల్లమాడ: మండలంలోని యర్రవంకపల్లి గ్రామంలో పల్లె సింధూరరెడ్డికి మద్దతుగా ఆమె భర్త పల్లె వెంకట కృష్ణ కిషోర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి ప్రజలకు సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలు పంచుతూ వాటి గురించి వివరించారు. కూటమి అధికారంలోకి వస్తే ఈ పథకాలను అమలవుతాయన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరా రెడ్డిని, ఎంపీగా పార్థసారథిని గెలిపించాలని కోరారు. ఆయనకు గ్రామంలో మహిళలు హారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ప్రసాద్ రెడ్డి, అన్నం లక్ష్మీనారాయణ, ఫైల శివశంకర్, బుట్టి నాగభూషణం నాయుడు, వేణుగోపాల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులు

కొత్తచెరువు: మండలంలోని తలమర్లగ్రామానికి చెందిన వైసీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, సంజీవరెడ్డిప్రతాప్‌రెడ్డి, సురేశ్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి గురువారం టీడీపీలోకి చేరారు. తలమర్లలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన మాజీ మంత్రిపల్లెరఘునాథరెడ్డి సమక్షంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పల్లె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రజాసేవకే పరిటాల కుటుంబం అంకితం: సత్యకుమార్



పరిటాల రవీంద్రఘాట్ వద్దనివాళులర్పిస్తున్న సత్యకుమార్‌యాదవ్

ధర్మవరం, ఏప్రిల్ 25: పరిటాల కుటుంబం అనునిత్యం ప్రజాసమస్యలపై పోరాడుతూ ప్రజాసేవకే అంకితమైందని ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గ కూటమి టీడీపీ అభ్యర్థి పరిటాల సునీతమ్మ నామినేషన్ కార్యక్రమం గురువారం జరిగింది. ఇందులో సత్యకుమార్ పాల్గొన్నారు. అనంతరం పరిటాల స్వగ్రామం వెంకటాపురానికి వెళ్లి అక్కడ పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌తో కలిసి పరిటాల రవి ఘాట్ వద్ద నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ... పరిటాల శ్రీరాములయ్య నుంచి పరిటాల శ్రీరామ్ వరకు వారి కుటుంబం ప్రజాసేవకు అంకితమైందని తెలిపారు. ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చినా తామున్నామంటూ భరోసా వారి ఆదరాభిమానాలను చూరగొంటున్నారన్నారు. ఈ ఎన్నికల్లో సునీతమ్మ అత్యధిక మెజారిటీతో గెలుపొందాలని ఆయన ఆకాంక్షించారు.

వార్డులలో సత్యకుమార్ సతీమణి ప్రచారం



7వ వార్డులో ప్రచారం చేస్తున్న త్రివేణి

ధర్మవరం: పట్టణంలోని 7,8వ వార్డులలో గురువారం కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ సతీమణి త్రివేణి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి కమలం గుర్తుకు ఓటు వేసి సత్యకుమార్‌ను ఎమ్మెల్యేగా, సైకిల్ గుర్తుకు ఓటు వేసి బీకే పార్థసారథిని ఎంపీగా గెలిపించాలని కోరారు. సత్యకుమార్ గెలిస్తే ధర్మవరంలో చేనేత వ్యవస్థకు పూర్వవైభవం తెస్తారన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వస్తే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

కేపులకుంటలో కందికుంట ప్రచారం



కేపులకుంటలో ప్రచారం చేస్తున్న కందికుంట

నల్లచెరువు, ఏప్రిల్ 25 : మండలంలోని కేపు లకుంట, దామావాండ్లపల్లి గ్రామాల్లో గురువారం కూటమి టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆయనకు ఘనస్వాగతం లభించింది. అడుగడుగునా మహిళలు హారతులు పట్టారు. తర్వాత కందికుంట గ్రామంలో ఇంటింటికి తిరిగి సైకిల్ గుర్తుకు ఓటేయాలని కోరారు. కూటమి అధికారంలోకి వస్తే సూపర్‌సిక్స్ పథకాలు అమలవుతాయన్నారు. చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారన్నారు. అవినీతి వైసీపీని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. తొలుత నల్లచెరువు పాత రైల్వేస్టేషన్ నుంచి యువకులు గ్రామాల వరకు బైక్‌ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోకి 15కుటుంబాలు చేరిక

కేపులకుంటకు చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు నాసునరసింహులు తన అనుచరవర్గంతో టీడీపీలో చేరారు. కదిరి పట్టణంలోని కందికుంట వెంకట ప్రసాద్ నివాసంలో గురువారం వారు ఆయన సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కందికుంట కండువాలే వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారు మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరినవారు ఆంజినేయులు, ప్రశాంత్, ఆనంద, మౌల, శశికుమార్, జి. మధు, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

27వ వార్డులో కందికుంట యశోదమ్మ ప్రచారం



27వార్డులో ప్రచారం చేస్తున్న కందికుంట యశోదాదేవి

కదిరి : చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో భవిష్యత్తు గ్యారెంటీ ఉంటుందని టీడీపీ కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ సతిమణి కందికుంట యశోదాదేవి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 27 వార్డులో ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీకి ఓటు వేయాలని కోరారు. చంద్రబాబుతో సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలు భవిష్యత్తుగా గ్యారెంటీగా ఉంటాయ న్నారు. ముఖ్యంగా వృద్ధులకు రూ.4 వేలు పించన్ ఇస్తారన్నారు. ప్రతింటికీ ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు అందిస్తారని చెప్పారు. రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.20వేలు అందిస్తారన్నారు. మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి అనుమతిస్తారన్నారు. అమ్మకు వందనం పేరుతో చదువుకునే పిల్లలకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ. 15 వేలు ఇస్తారన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి కందికుంట ప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బంగారు క్రిష్ణమూర్తి, పుల్లయ్య, రమేష్, అయూబ్, అతహర్ ఐటీడీపీ నాయకులు జెఎస్ మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య తీర్చాలని ఆందోళన



సచివాలయం ముందు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 25: మండలంలోని కొట్లపల్లి బీసీ కాలనీలో నీటి సమస్యను పరిష్కరించాలంటూ స్థానిక మహిళలు గురువారం గ్రామసచివాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కాలనీకి చెందిన రాములమ్మ, లక్ష్మమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నాగిరెడ్డి, రామయ్య, బేల్దారి రామాంజి తదితరులు ఖాళీ బిందెలతో గ్రామసచివాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొట్లపల్లి, సురగానిపల్లి గ్రామాలకు సంబంధించి మూడుబోర్లు ఉండగా అందులో ఒకటి మరమ్మతుకు గురైందన్నారు. మిగతా రెండు బోర్లలో నీరు సరిగా రాకపోవడంతో ఎగువ ప్రాంతమైన బీసీ కాలనీలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొందన్నారు. దీంతో చేసేదిలేక వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నామన్నారు. గతేడాది అంగన్వాడీ భవనం వద్ద బోరు వేశారని, వీటిలో నీరు సమృద్ధిగా ఉన్నా సంబంధిత అధికారులు పైపులైన్ వేసి ఉపయోగించ లేదని వారు మండిపడ్డారు. అధికారులు వెంటనే స్పందించి గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలని, గేట్‌వాల్వులు ఏర్పాటు చేసి ఎగువ ప్రాంతాలకు నీరు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరిస్తామని సచివాలయ సిబ్బంది తెలపడంతో వారు ఆందోళన విరమించారు.

ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోండి : ఎస్పీ

ధర్మవరం, ఏప్రిల్ 25: రాబోయే ఎన్నికలలో ప్రతి ఒక్కరు ధైర్యంగా ఓటు వేయాలని, ఎవరికీ భయపడవద్దని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. పట్టణంలోని మార్కెట్‌యార్డు వద్దగల మున్సిపల్ పాఠశాల, గూడ్‌షెడ్‌కొట్టాల, లక్ష్మీచెన్నకేశవపురం పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ సుబ్రమణ్యంలకు సూచనలు చేశారు.. ఎన్నికల సందర్భంగా ఎవరైన బెదిరింపులకు పాల్పడితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అదే విధంగా డయల్ 100ను వినియోగించుకోవాలని ప్రజలకు తెలియజేశారు. ఆయన వెంట ఎస్పీఎస్‌ఐ ప్రదీప్‌కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య మాటల యుద్ధం

- సీఐ రాకతో సద్దుమణిగిన సమస్య

కొత్తచెరువు, ఏప్రిల్ 25: మండలంలోని తలమర్ల పంచాయతీలో టీడీపీ నాయకులు మాజీ మంత్రిపల్లెరఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గత బుధవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలోభాగంగా తలమర్ల, బంగారుచెన్నేపల్లికి చెందిన నాయకులు, కార్యకర్తలు ద్విచక్రవాహనానికి సైకిల్ కట్టుకుని వెళ్లారు. దీనిని గమనించిన టీడీపీ నాయకులు గురువారం తలమర్లకు చెందిన యువకులు ద్విచక్రవాహనానికి ఫ్యాన్‌ను కట్టుకుని గ్రామంలో తిరిగారు. దీనిని తట్టుకోలేని కొందరు వైసీపీ నాయకులు ఆ యువకులను మందలించి చేయి చేసుకున్నారు. దీంతోఒక్కసారిగా టీడీపీ,వైసీపీ నాయకుల మధ్య మాటలయుద్ధం జరిగింది. విషయం తెలుసుకున్న సీఐ రాజారమేశ్ సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు సర్ది చెప్పి గొడవలకు దిగితే ఎవరినీ ఉపేక్షించరని హెచ్చరించడంతో గొడవ కాస్త సద్దుమణిగింది.దీంతో టీడీపీ నాయకులు ప్రచారాన్ని నిర్వహించారు.

రేపు పాలిసెట్ ప్రవేశపరీక్ష

ధర్మవరంరూరల్, ఏప్రిల్25: పట్టణంలోని వివిధ కేంద్రాల్లో ఈనెల 27వ తేదీన పాలిసెట్ ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రభుత్వపాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ కోఆర్డినేటర్ సురేష్‌బాబు గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు పరీక్ష కేంద్రాలలోకి అనుమతి ఉంటుందన్నారు. పట్టణంలోని కొత్తపేట మున్సిపల్‌హైస్కూల్, గర్ల్స్ హైస్కూల్ కొత్తపేట, కేహెచ్ ప్రభుత్వడిగ్రీకళాశాల, ఉషోదయస్కూల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, బీఎస్సార్ స్కూల్, మున్సిపల్ గర్ల్స్‌హైస్కూల్, గణేష్‌మున్సిపల్ హైస్కూల్, సుందరయ్య నగర్‌లోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు ఉదయాన్నే 10గంటల్లోపు కేంద్రాల వద్దకు చేరుకోవాలన్నారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు సరైన సమయానికి చేరకుని పరీక్ష రాయాలని ప్రిన్సిపాల్ సూచించారు.

పాలిసెట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

కదిరి అర్బన్ : ఈనెల 27నుంచి పాలిసెట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కదిరి పాలిసెట్ కోఆర్డినేటర్ డాక్టర్ఎల్ నారాయణ తెలిపారు. పట్టణంలో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్‌తోపాటు ఆధార్‌కార్డు, బాల్‌పాయింట్ పెన్, పెన్సిల్ తెచ్చుకోవాలన్నారు. ఉదయం 10గంటలకు పరీక్షా కేంద్రాలకు రావాలన్నారు. మరిన్ని వివరాలకు 9590312443కు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చన్నారు.

28న 'మేము సైతం-మనరాష్ట్రం కోసం'

ధర్మవరం, ఏప్రిల్ 25: ధర్మవరం నియోజకవర్గ కూటమి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్, హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధిల గెలుపే లక్ష్యంగా తెలుగు ప్రొఫెషనల్స్‌వింగ్,బీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 28న ఆదివారం మేముసైతం-మన రాష్ట్రం కోసం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ విభాగం ప్రతినిధులు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమం ముందుగా కాలేజ్ సర్కిల్ నుండి కదిరి గేటు వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. ఈ ర్యాలీలో ఐటీ నిపుణులు, వైద్యులు, న్యాయవాదులు, నిరుద్యోగయువత, ఇతర రంగాల నిపుణులు పాల్గొంటారన్నారు. వీరితో సీఎస్‌బీ ఫంక్షన్‌హాల్‌లో సత్యకుమార్, బీకే, పరిటాల శ్రీరామ్‌లతో ముఖాముఖీ కార్యక్రమం ఉంటుందన్నారు. అందరూ విజయవంతం చేయాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు టీడీపీ కార్యకర్తల మృతి

- విషాదంలో లింగప్పగారిపల్లి



మృతులు నరసానాయుడు, ప్రభాకర్(ఫైల్)

బుక్కపట్నం, ఏప్రిల్ 25: మండలంలోని లింగప్పగారిపల్లి గ్రామ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు టీడీపీ కార్యకర్తలు మృతిచెందారు. లింగప్పగారిపల్లి గ్రామానికి చెందిన నరసానాయుడు(42), ప్రభాకర్(33) సిద్దరాంపురం నుంచి స్వగ్రామమైన లింగప్పగారిపల్లికి ద్విచక్రవాహనంలో వెళ్తున్నారు. గ్రామ సమీపంలోకి రాగానే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీ కొట్టారు. ప్రమాదంలో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని అనంతపురం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. నరసానాయుడుకు భార్య కళావతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ప్రభాకర్‌కు భార్య పౌర్ణమి , ఇద్దరుకుమారులు ఉన్నారు. ఈ సంఘటనతో లింగప్పగారిపల్లిలో విషాధచాయలు అలుముకున్నాయి. మృతులను పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



కృష్ణమూర్తి (ఫైల్)

ఓబుళదేవరచెరువ, ఏప్రిల్ 25 : మండలంలోని వడ్డివారిపల్లి సమీపంలో ఎస్సీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వెనుకవైపు సోమావతి నదిలో వేమారెడ్డిపల్లికి చెందిన ఉప్పుతోళ్ల కృష్ణమూర్తి(43) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఏఎస్‌ఐ కిశోర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. సోమావతి నదిలోని చెలిమిలో వ్యక్తి మృతిచెందినట్లు ఉపాధి కూలీలు గురువారం గుర్తించారు. ఈ విషయాన్ని వీఆర్ఓ అంజనేయులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి ఎస్‌ఐ వంశీకృష్ణ, ఏఎస్‌ఐ కిషోర్‌రెడ్డి చేరుకుని చెలిమిలో పడిఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోందన్నారు. మృతుడు వేమారెడ్డిపల్లికి చెందిన ఉప్పుతోలు కృష్ణమూర్తిగా గుర్తించారు. వీఆర్‌ఓ ఆంజనేయులు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితి మృతిగా కేసు నమోదుచేసి మృతదేహాన్ని సంఘటనా స్థలంలోనే పోస్ట్‌మార్టం నిర్వహించినట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు సంతానం.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



మంజునాథ్‌రెడ్డి (ఫైల్)

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 25 : మండలంలోని చౌడేపల్లిలో సాఫ్ట్‌వేరి ఉద్యోగి మంజునాథ్‌రెడ్డి(25) ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్‌ఐ కిశోర్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. చౌడేపల్లి గ్రామానికి చెందిన లక్ష్మిరెడ్డి, కళావతి దంపతుల ఏకైక కుమారుడు మంజునాథ్ రెడ్డి . ఇతను సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇంటిలోనే ఉంటూ చేసుకునేవాడు. నాలుగు నెలల క్రితం వివాహమైంది. అయితే భార్య భర్తల నడుమ మనస్పర్థలు ఏర్పడి భార్య ఒకటిన్నర నెల క్రితం పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్థాపం చెందిన అతను గురువారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పొలం నుంచి వచ్చిన తల్లిదండ్రులు గమనించగా అప్పటికే మృతిచెందాడు. ఏకైక కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ముగిసిన నామినేషన్ల గడువు

- ధర్మవరం నుంచి 26 మంది నామినేషన్ల దాఖలు

ధర్మవరం, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగిసింది. ధర్మవరం నుంచి 26 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ఘట్టం ఈనెల 18 నుంచి ప్రారంభంకాగా 25వతేదీతో ముగిసింది. ఇందులో బీజేపీ తరఫున సత్యకుమార్ యాదవ్, అంబటిసతీశ్‌కుమార్, వైసీపీ తరఫున కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, కాంగ్రెస్ తరఫున రంగన అశ్వర్థనారాయణ, బీఎస్పీ తరఫున సాకే వినయ్‌కుమార్, నవతరం పార్టీ తరఫున షేక్‌అయాజ్, అఖిల భారత కిసాన్ జనతా పార్టీ తరఫున గట్టుచైతన్య, అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున ఎస్.వీరనారాయణస్వామి, జైభీమ్‌రావ్ భారత్ పార్టీతరఫున దారా శంకర్ నామినేషన్లు దాఖలు చేయగా స్వతంత్ర అభ్యర్థులుగా దాసరి కవిత,సూర్యనారాయణ, బిల్లేనరేంద్ర, బీరే సోమశేఖర్, నాగురమీంద్రా రెడ్డి, ఎం.ఈశ్వర్‌రెడ్డి, ఎన్.దనుంజయ, ఇలియాజ్ మహమ్మద్‌సయ్యద్, శ్రీరాములునాయక్ నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో కొందరు రెండు సెట్లు చొప్పున నామినేషన్లు దాఖలు చేయడం విశేషం.

కదిరి అసెంబ్లీకి 28 నామినేషన్లు

కదిరి/ పుట్టపర్తి: కదిరి అసెంబ్లీ స్థానానికి మొత్తం 28 నామినేషన్లు వచ్చినట్లు కదిరి ఎన్నికల అధికారి వంశీక్రిష్ణ తెలిపారు. టీడీపీ 8సెట్లు, వైసీపీ 5సెట్లు, బీఎస్పీ ఒకటి, కాంగ్రెస్ 4 సెట్లు, ఇండియన్ కాంగ్రెస్ పార్టీ ఒకటి, పిరమిడ్ పార్టీ ఒకటి, రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా ఒకటి, ఆరుగురు ఇండిపెండింట్ నామినేషన్లు వేశారు. టీడీపీ కూటమి నుంచి కందికుంట వెంకటప్రసాద్, వైసీపీ తరఫున మగ్బుల్ అహమ్మద్ నామినేషన్ వేశారు. కాంగ్రెస్ పార్టీ కి షాన్‌వాజ్ నామినేషన్ వేశారు. ఇక పుట్టపర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి మొత్తంగా 38 నామినేషన్లు దాఖలయ్యాయి.

PUBLIC NOTICE
UNDER the instructions of my Client M/s. Shriram Finance Limited, Chennai, Branch at Kadiri. I issue the following notice to general public. My Clients intends to grant loan to T.Suryanarayana, S/o. T.Kullayappa, Murthy Pally Kadiri, Ananthapur - 515591. by keeping the below mentioned property of him, as Security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges, Mortgages, Sale agreements, Court attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.
SCHEDULE
Document No: 2089/2005. Ananthapur RD Kadiri Sub RD Being in Kadiri Municipality being in Kadiri of Kadiri polam , Survey No: 35, 2.87 upto : 10 Cents, Boundaries : East : My Jaga, West : Elike Sriramulu Pahipati Lakshmanna, North : Pasam Chinna Venkatesu Bhoomi, South : Rastha.
Patan Jafar Khan, Advocate, Kadiri, Cell: 94409 88774

అరటితోట దగ్ధం



దగ్ధమైన అరటితోట

తాడిమర్రి, ఏప్రిల్ 25: మండలంలోని దాడితోట గ్రామంలో గురువారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో 2 వేలకు పైగా అరటి చెట్లు, డ్రిప్ సామాగ్రి అగ్నికి ఆహుతై రూ.4లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు కంచెకు నిప్పుపెట్టడం మూలంగా ప్రమాదం సంభవించినట్లు రైతు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మరో వారంరోజుల్లో కోతకు కోయాల్సిన అరటిపంట అగ్నికి ఆహుతి కావడంతో భారీగా నష్టపోయామని తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.



బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రః 7382114647
AJA-176988
కావలెను
ప్రముఖ ఆఫీస్ నందు పని చేయుటకు అనుభవం కలిగిన అకౌంటెంట్ మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను JK.Enterprises, Opp Montessori School, Gooty Road, ATP, Cell:8008803109.
AJA-189403

స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించిన పోలీస్ శాఖ అబ్జర్వర్



బిట్ కళాశాలలో స్ట్రాంగ్ రూం ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీస్ శాఖ అబ్జర్వర్

హిందూపురం అర్బన్/ లేపాక్షి, ఏప్రిల్ 25: ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఎటు వంటి అసౌకర్యం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్‌శాఖ అబ్జర్వర్ నాగాలాండ్‌కు చెందిన ఇమ్నాలెన్లా ఐపీఎస్ పేర్కొన్నారు. ఆయన గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి హిందూపురంలోని బిట్ ఇంజనీరింగ్ కళాశాలను పరిశీలించారు. ముందస్తు ఏర్పాట్లు గురించి అధికారులను అడిగి తెలుసు కున్నారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. అలాగే నియోజకవర్గాల వారిగా గదులు కేటాయింపు, ఈవీఎంలు, వీవీ ప్యాట్లు భద్రపరిచే స్ట్రాంగ్ రూంలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ, చర్యలు తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఎస్పీ కన్జక్షన్‌తో ఆరాతీశారు. తరువాత లేపాక్షి అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలు, ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం లేపాక్షి వీరభద్రాలయం, నంది విగ్రహాన్ని సందర్శించారు. ఆయన వెంట సీఐ ఈరన్న, తహసీల్దార్ బాబు, ఎస్‌ఐ గోపి, ఎన్నికల డీటీ రెడ్డిశేఖర్, ఆర్ఐ అమరేంద్ర తదితరులు ఉన్నారు.

సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారిగా వాసుదేవన్ బాధ్యతలు



న్యాయాధికారి వాసుదేవన్

పెనుకొండ, ఏప్రిల్ 25: పట్టణంలోని సీనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారిగా వాసుదేవన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారిగా ఉన్న శంకర్‌రావు అనంతపురంకి బదిలీ కాగా ఆయన స్థానంలో బొబ్బిలిలో సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారిగా విధులు నిర్వహిస్తున్న వాసుదేవన్ బాధ్యతలు స్వీకరించారు. న్యాయాధికారి వాసుదేవన్‌కు స్థానిక న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డితోపాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గోరంట్ల, ఏప్రిల్ 25: ఇటీవల విద్యుదాఘాతానికి గురై అనంతపురం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నవీన్‌కుమార్(30) గురువారం మృతి చెందినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. పుట్టపర్తి మండలం పెడబల్లికి చెందిన బలిజ వెంకటేష్ కుమారుడు నవీన్ కుమార్ గోరంట్ల మండ లం మల్లెల గ్రామం వద్ద గల పాల డెయిరీలో మెయింటెనెన్స్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈ సంవత్సరం మార్చి 30వ తేదీన పాల డెయిరీ వద్ద విద్యుదాఘాతానికి గురై కొండాపురం, గోరంట్ల, హిందూపురం ఆసుపత్రిలో చికిత్సలు పొందాడు. అనంతరం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. అయితే ఇది ప్రమాదవశాత్తు జరిగిన సంఘటన కాదని అత్తహత్యా యత్నం కోసం జరిగిన సంఘటనగా పోలీసులు పేర్కొన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గోరంట్ల, ఏప్రిల్ 25: మండలంలోని కొండాపురం క్రాస్ వద్ద కర్ణాటక నుంచి ద్విచక్రవాహనంపై మద్యం తరలిస్తున్న ఇద్దరిని గురువారం అరెస్టు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. మండలం లోని కోరేవాండ్ల పల్లికి చెందిన ఒకరు, కమ్మలవాండ్లపల్లికి చెందిన మరొకరు బాగేపల్లి నుంచి ద్విచక్రవా హనంపై 192 టెట్రా పాకెట్లు మద్యాన్ని తరలిస్తూ పట్టుపడ్డారన్నారు. మద్యంతోపాటు ద్విచక్రవాహ నాన్ని స్వాధీనం చేసుకుని, ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామన్నారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత

చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం

అగళి, ఏప్రిల్ 25: మండలంలోని ఇరిగేపల్లి వద్ద స్వర్ణముఖి నదీ తీరంలో అక్రమంగా చెట్లు నరికేస్తున్నా అధికారులు కనీసం చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. ఇప్పుడే ఎండలు మండిపోతున్నాయి. వర్షాలు కనుచూపు మేర లేవు. ఉన్న కొద్దిపాటి చెట్లు నరికేస్తుంటే ఆక్సిజన్ కరువై చిన్నారులు, వృద్ధులు, ప్రజలు అల్లాడిపోతారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు అటవీ శాఖ అధికారులకు తెలిపినా పట్టించుకున్న పాపానపోలేదని గ్రామస్తులు డాక్టర్ శంకర్‌నారాయణ, కోడిపల్లి కామరాజు తదితరులు ఆరోపిస్తున్నారు. ఇక్కడి చెట్లను నరికి బెంగళూరు లాంటి నగరాలకు కలపను తరలించి సొమ్ము చేసుకుంటున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెట్ల నరికివేతను ఆపాలని పర్యావరణ వేత్త శంకర్‌నారాయణ, మడకశిర గ్రీన్‌భారత్ అధ్యక్షుడు కోడిపల్లి కామరాజు తదితరులు డిమాండ్ చేశారు.



చెట్లను నరికేసిన దృశ్యం

సొంత చెల్లెళ్ల ఉసురు పోసుకుంటున్న సీఎం

- గులకరాయి వేయించుకునేందుకే సిద్ధం
- ఎన్నికల ప్రచారంలో బాలకృష్ణ



మణేసముద్రంలో ప్రచారం చేస్తున్న నందమూరి బాలకృష్ణ

హిందూపురం, ఏప్రిల్ 25: రాష్ట్రంలో ఉన్న మహిళలు తన అక్కా చెల్లెళ్లు అంటూ చెప్పుకునే ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి తన సొంత చెల్లెళ్ల ఉసురు పోసుకుంటున్నారని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం హిందూపురం మండలంలోని బాలంపల్లి, చలివెందుల, మలగూరు, మణేస ముద్రం, కగ్గల్లు, బీరేపల్లి పంచాయతీల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 1600 కోట్లు వృథాచేసి సిద్ధం పోస్టర్లు పెట్టించారన్నారు. తాను సిద్ధమని అంటున్నాడు. ఎందుకు గులకరాయి వేయించుకునేందుకు సిద్ధమా? రాష్ట్ర ప్రజలను ఇంకా మోసం చేయడానికి సిద్ధమా? అని ప్రశ్నించారు. సీఎం జగన్ రాష్ట్ర భవిష్యత్తుని సర్వ నాశనం చేస్తూ సైకోలిక ఆనందం పొందుతున్నాడని విమర్శించారు. జ నం అంతా ఏకమై జగన్‌ను ఇంటికి పంపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఓటుతో ఆయనకు పోటు పొడ వాల న్నారు. మన ఓటు రుచి చూపించాలన్నారు. జగన్మోహన్ రెడ్డి అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత తనదే అని, టీడీపీ అధికారంలోకి వస్తే హిందూపురాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. నాయకులు, కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉమ్మడి పార్టీల సభలకు వస్తున్న జనాన్ని చూస్తే అధికారంలోకి రావడం ఖాయమైందన్నారు. ఈ సందర్భంగా మలుగూరు, చలివెందులలో కొంతమంది వైసీపీ నాయకులు పార్టీలో చేరారు. వారికి బాలకృష్ణ కండువాలు వేసి ఆహ్వానించారు. ప్రచారంలో భాగంగా ఆయన బాలంపల్లిలోని ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. చలివెందులలో మాజీ సర్పంచ్ చిన్నారెడ్డి ఇంటికి వెళ్లి గ్రామస్థులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పలెల్లో జనం నీరాజనం పలికారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అశ్వత్థ నారాయణరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వేణునాథ్ ఆనంద్, ఆంజినరెడ్డి, దిన్నారెడ్డి, మంగేష్, మంజునాథ్, విష్ణు, నాగభూషణ, బాబురెడ్డి, రామకృష్ణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు పుట్టినిల్లు.. టీడీపీ

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత



సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న సవిత

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 25: రాజకీయ రంగంలో తెలుగుదేశం పార్టీ బీసీలకు పుట్టినిల్లని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె బుధవారం సోమందేపల్లి మండలంలోని బ్రహ్మసముద్రం, కొల్లకుంట, రూకలపల్లిల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలు వివరించారు. సవితకు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీడీపీ ఆవిర్భావానికి మునుపు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు రాజకీయ అధికారానికి దూరంగా ఉండేవారన్నారు. బీసీలంటే బ్యాక్వర్డ్‌క్లాస్ కాదని, సమాజానికి బ్యాక్‌బోన్ క్లాసెస్‌ని నినదించిన దివంగత ఎన్టీరామారావు అందుకు అనుగుణం గా బీసీలకు రాజకీయాల్లో రిజర్వేషన్ కల్పించారని గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తినే కొనసాగించిన చంద్రబాబు రిజర్వేషన్లను 34శాతానికి పెంచి అనేక మంది బీసీలను రాజకీయ నాయకుల్లా తీర్చిదిద్దారన్నారు. పలు కార్పొరేషన్లు ఏర్పాటుచేసి... సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి రంగాల్లో బీసీల అభివృద్ధికి బాటలు వేశారన్నారు. స్థానిక సంస్థల దగ్గర నుంచి రాజ్యసభ పదవుల వరకు బీసీలను ప్రోత్సహించారన్నారు. అదేజగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి పోయారన్నారు. కార్పొరేషన్లు పుల్లు, నిధులు నిల్లు కావడంతో గడిచిన నాలుగున్నరేళ్ల పాలనలో బీసీలకు ఎటువంటి మేలు జరగలేదన్నారు. బీసీల సంక్షేమం, సబ్ ప్లాన్ నిధులు రూ.75వేల కోట్లను దారి మళ్లించడమే కాకుండా వారి అభివృద్ధికి కొనసాగిన టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన 30పథకాలను రద్దుచేసిన సీఎం జగన్ బీసీల ద్రోహిగా మిగిలిపోయారన్నారు. ఇప్పటికే సైకో పాలనతో జనం విసిగిపోయారని రానున్నది టీడీపీనేఅన్నారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతం నుంచి పట్టణాలవరకు రాష్ట్రంలో మార్పుమొదలైందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిద్ధలింగప్ప, డీవీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



జీకే, సవితను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి బీకే

సోమందేపల్లి మండలం మండ్లి, ముద్దపుకుంట, జూలకుంట గ్రామాల్లో టీడీపీ కూటమి హిందూపురం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధి గురువారం పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. జరగబోయే ఎన్నికల్లో సైకిల్‌గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.

అభివృద్ధి అంటే ఇదేనా?: టీడీపీ



చిన్నకోడిపల్లిలో మురుగుకాలువను చూపుతున్న టీడీపీ నాయకులు

రొద్దం, ఏప్రిల్ 25 : వైసీపీ ఐదేళ్ల పాలనలో మండలంలోని చిన్నకోడిపల్లిలో ఒక్క సీసీరోడ్డు, డ్రైనేజీ వేయకపోవడంతో మురుగునీరు ఇళ్ల వద్ద దుర్వాసన వెదజల్లుతోందని టీడీపీ నాయకులు విమర్శించారు. అభివృద్ధి అంటే ఇదేనా అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వారు గురువారం చిన్నకోడిపల్లిలో ప్రచారానికి వెళ్లారు. రోడ్డుపక్కనే ఇళ్ల వద్ద మురుగునీరు కాలువల్లో ముందుకు సాగక, కంపువాసన కొడుతున్న దృశ్యం వారి కంటపడింది. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య, చంద్రమౌళి, నరహరి, అశ్వత్థనారాయణ, మురళి, రొద్దకంపల్లి నాగరాజు, నారాయణ, హరీష్, మరువపల్లి శ్రీనివాసులు, మారుతి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే వారు మండలంలోని కుర్లపల్లి, చిన్నకోడిపల్లి, కంచుకొర్ల పల్లి, రొద్దకంపల్లి, ఆర్‌మరువపల్లిల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

మడకశిర అభివృద్ధే లక్ష్యం

సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్ రఘువీరారెడ్డి

మడకశిరటౌన్, ఏప్రిల్ 25: మడకశిర నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నదే కాంగ్రెస్ పార్టీ ఏకైక లక్ష్యమని, తను చివరివరకు అదే ఆకాంక్షిస్తానని సీడబ్ల్యూసీ సభ్యులు, మాజీ మంత్రి ఎన్ రఘువీరారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కే సుధాకర్ గురువారం నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అనంతరం మడకశిర పట్టణంలో జరిగిన ర్యాలీలో రఘువీరారెడ్డి పాల్గొని మాట్లాడారు. నామినేషన్ కార్యక్రమానికి మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. అయితే కాంగ్రెస్ పార్టీ నామినేషన్ కార్యక్రమానికి భారీ ఎత్తున జనం తరలిరావడంతో ఎవరికి నష్టం అన్న చర్చ సాగుతోంది. గతంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన అనేక మంది నాయకులు, కార్యకర్తలు వైసీపీలో చేరారు. ప్రస్తుతం రఘువీరారెడ్డి రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటుండటంతో వైసీపీ అనేక మార్పులు జరుగుతుందో అన్న చర్చ సాగుతోంది. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొంటుండటంతో వైసీపీ నాయకుల్లో సైతం కొంత ఆందోళన నెలకొంది.

కూటమికి 140కిపైగా స్థానాలు తథ్యం

- జగన్ అక్రమాలకు పాల్పడ్డాడని కేంద్రమంత్రే చెప్పారు
- మైనార్టీలకు టీడీపీనే అండ
- ఎన్నికల ప్రచారంలో ఇక్బాల్

హిందూపురం, ఏప్రిల్ 25: రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి 140కిపైగా ఎమ్మెల్యే స్థానాలు వస్తాయని మాజీ ఎమ్మెల్సీ షేక్ మహ్మద్ ఇక్బాల్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన గురువారం హిందూపురంలోని మైనార్టీలున్న ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఈ ప్రభుత్వాన్ని కూలదోయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రస్తుతం ఉన్న ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడు ఈ రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. వైసీపీ ప్రభుత్వం అక్రమాలకు పాల్పడిందని కేంద్ర మంత్రి రాజనాథ్‌సింగ్ చెప్పినట్లు గుర్తుచేశారు. వైసీపీ పాలనలో రూ. 13లక్షల కోట్లు రాష్ట్రంపై అప్పులు మిగిల్చారని ఒక్కొక్కరిపై రూ. రెండులక్షల అప్పు మోపారన్నారు. దీనిపై సమగ్ర సమాచారం ఉందని కేంద్ర మంత్రి చెప్పారంటే సీఎం జగన్ ఎంత అవినీతికి పాల్పడ్డాడో అర్థం అవుతుందన్నారు. ప్రజలను ఓ వైపు ఇసుక, మద్యంలో దోచేశారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నగదురూపంలో మద్యం దుకాణాల్లో విక్రయాలు జరుగుతున్నాయంటే ఇది దోపిడీకి నిదర్శనమన్నారు. మంచి పరిపాలనా దక్షుడు చంద్రబాబు అన్నారు. ఈ రాష్ట్ర పాలన గాడిలో పడాలంటే కూటమి అభ్యర్థుల విజయం సాధించాలన్నారు. వైసీపీలో అన్ని వ్యవస్థలు నాశనం అయ్యాయని విమర్శించారు. ఈయన వెంట మునిసిపల్ మాజీ చైర్మన్ అనిల్‌కుమార్, పట్టణాధ్యక్షుడు రమేష్, మాజీ కౌన్సిలర్ హిదాయతుల్లా, డైమండ్‌బాబా, షఫీ, డా.బాషా, ప్యారాసాబ్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి శూన్యం

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 25: వైసీపీ ఐదేళ్లపాలనలో పెనుకొండ మండలంలోని పలు గ్రామాలు అభివృద్ధి పనులకు నోచుకోలేదు. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఐదేం పాలన అని గ్రామీణులు వైసీపీ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు. పెనుకొండ నగర పంచాయతీలోని ఇందిరమ్మ కాలనీ, కోనాపురం, రూరల్ పరిధిలోని వెంకటగిరిపాళ్యంలో అభివృద్ధి పనులు జరుగలేదు. ఆయా గ్రామాల్లో డ్రైనేజీ నిర్మించలేదు. దీంతో మురుగు కాలువలు లేకపోవడం వల్ల ప్రజలు ఇళ్ల ఎదుట పోసే వ్యర్థపు నీరు రోడ్లపై చేరుతోంది. అక్కడే నిల్వ ఉండి మురుగుకూపాలను తల పిస్తున్నాయి. వాటిలో దోమలు వృద్ధిచెంది గ్రామస్తులకు రాత్రిపూట నిద్రలేకుండా చేస్తున్నాయి. అవి కుట్టడంతో జ్వరాలబారిన పడుతున్నా మని గ్రామస్తులు తెలుపుతున్నారు. కౌన్సిళ్ల నుంచి అధికారులు, నాయకులను వేడుకుంటున్నా పట్టించు కోవడంలేదని వాపోతున్నారు. గ్రామాల్లో డ్రైన్లు, రోడ్ల నిర్మాణాలు చేపట్టేవారికే వచ్చే ఎన్నికల్లో పట్టం కడతామని ఆయా గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల ఎదుట మురుగునీరు



వెంకటగిరిపాళ్యంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

పోలింగ్‌కు భారీ భద్రత

పావగడ, ఏప్రిల్ 25: కర్ణాటక రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి తొలివిడతలో భాగంగా శుక్రవారం పావగడలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారి సంతోష్‌కుమార్ తెలి యజేశారు. రాష్ట్రవ్యాప్తంగా తొలివిడతలో 15 జిల్లాలకు సంబంధించి ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో భాగంగా చిత్రదుర్గ పార్లమెంటుకు సంబంధించి శుక్రవా రం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని ఆయన తెలిపారు. పావగడ తాలూకా వ్యాప్తంగా 246 పోలింగ్ బూత్‌లలో ఎన్నికల పోలింగ్ జరుగుతుందని, వాటిలో 25 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి వాటికి ప్రత్యేక పోలీసు బందో బస్తు ఏర్పాటు చేశామన్నారు. తాలూకా వ్యాప్తంగా 1,97,548 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. పోలింగ్ బూత్‌లకు బందోబస్తుగా 100 మంది సివిల్ పోలీసులు, 150 మంది రిజర్వ్‌డ్ పోలీసులు, 80 మంది హైవే పోలీ సులు, ఒక కేఎస్ఆర్‌పీ బెటాలియన్, 500 మంది హోం గార్డ్ పోలీసులను కేటాయించామన్నారు. అలాగే ఒక డీవైఎస్‌పీ, ఐదుగురు సీఐలు, 20 మంది ఎస్‌ఐలు, ఒక్కొక్క పోలింగ్ బూత్‌కు ఇద్దరు హోం గార్డులను నియమించామని తెలిపారు. స్పెషల్ స్క్వాడ్ పోలీసులు, ఎన్నికల పరిశీలన అధికారులు కూడా తాలూకా వ్యాప్తంగా పర్యటించనున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఓటర్లు సహకరించి, తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల అధికారి తెలియజేశారు.



పోలింగ్ బూత్‌లకు తరలివెళ్తున్న సిబ్బంది

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

- పురం బరిలో 21 మంది..
- 34 నామినేషన్ పత్రాలు దాఖలు



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న నందమూరి వసుంధరాదేవి

హిందూపురం, ఏప్రిల్ 25:అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగిసింది. ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు సైతం నామినేషన్లు వేశారు. హిందూపురం అసెంబ్లీ స్థానానికి 21 మంది అభ్యర్థులు 34 నామినేషన్ల పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల ప్రక్రియ ముగిసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అభిషేక్ కుమార్ తెలిపారు. టీడీపీ తరఫున నందమూరి బాలకృష్ణ, ఆయన సతీమణి నందమూరి వసుంధర దేవి, వైసీపీ తరఫున దీపిక, ఆమె భర్త వేణురెడ్డి, వెంకటేశ్‌రెడ్డి, కాంగ్రెస్ తరఫున ఇనయతుల్లా, అనీసాబానుల నామినేషన్ వేశారు. అలాగే బీఎస్పీ తరఫున శ్రీరాములు, సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా పార్టీ తరఫున రవీంద్ర, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమితి తరఫున కొడుమూరు నౌషద్, జయభీం రావ్ భారత్ పార్టీ తరఫున నాగరాజు, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తరఫున పార్వతి, నవతరం పార్టీ తరఫున షేక్ షౌకాత్, మరో 8 మంది స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వైసీపీ తరఫున నామినేషన్ వేసిన వెంకటేశ్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా కూడా మరో నామినేషన్ దాఖలు చేశారు. ఆఖరి రోజు గురువారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఇనయతుల్లా, టీడీపీ తరఫున నందమూరి వసుంధర దేవి నామినేషన్లు దాఖలు చేశారు.

పెనుకొండ అసెంబ్లీ స్థానానికి 25...

పెనుకొండ: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పెనుకొండ నియోజకవర్గ అసెంబ్లీ స్థానానికి నామినేషన్ గడువు ముగిసే సమయానికి మొత్తం 25నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. ఆఖరి రోజైన గురువారం మంత్రి, వైసీపీ అభ్యర్థి ఉషశ్రీచరణ్, అట్టహాసంగా నామినేషన్ల పత్రాలను రిటర్నింగ్ అధికారి అపూర్వభరత్‌కు అందజేశారు. అనంతరం టీడీపీ అభ్యర్థి సవిత తరఫున ఒక నామినేషన్, టీడీపీ మద్దతుగా కురుబ రవికుమార్ మరో నామినేషన్ దాఖలు చేశారు. బీఎస్పీ అభ్యర్థి ఆదినారాయణ, జైభీమ్ పార్టీ నాగరాజు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరసింహప్ప, స్వతంత్ర అభ్యర్థులు గణేష్‌నాయక్, హబీబ్, నరేంద్ర, నరసింహులు, నామినేషన్ వేశారు. నామినేషన్ల గడువు ముగిసేనాటికి టీడీపీ నాలుగు, వైసీపీ రెండు, బీఎస్పీ నాలుగు, జైభీమ్ ఒకటి, కాంగ్రెస్ పార్టీ మూడు, స్వతంత్ర అభ్యర్థులు 11నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అపూర్వభరత్ తెలిపారు.

మడకశిరలో 35...

ఆఖరి రోజు 13 నామినేషన్ల దాఖలు

మడకశిర: మడకశిర నియోజకవర్గంలో ఆఖరి రోజు గురువారం 13 మంది నామినేషన్ల అభ్యర్థులు దాఖలు చేశారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో మొత్తం 35 నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఇందులో భాగంగా టీడీపీ చెందిన ఎంఎస్‌రాజు నాలుగు సెట్లు, వైసీపీ తరఫున ఈరలక్కప్ప నాలుగుసెట్లు, కాంగ్రెస్ పార్టీ తరఫున కెసుధాకర్ రెండు సెట్లు వేశారు. స్వతంత్ర అభ్యర్థి గా సునీల్ కుమార్ 3 సెట్లు, రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా పరశురాం గారి హనుమంతరాజు రెండు సెట్లు, బహుజన సమాజ్ పార్టీ తరఫున ఇందివర్, టీడీపీ తరఫున నరసన్నగారి మంజునాథ్ నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులు 15 సెట్లు నామినేషన్లు దాఖలయ్యాయి.

మలేరియా రహిత సమాజమే లక్ష్యం

వైద్యాధికారులు



అగళిలో మానవహారంగా ఏర్పడిన వైద్య ఆరోగ్య సిబ్బంది

అగళి, ఏప్రిల్ 25 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని గురువారం డాక్టర్ శివానంద గాయత్రి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి మడకశిర మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా రహిత సమాజమే లక్ష్యంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. దోమల నియంత్రణ మన అందరి బాధ్యత అన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. నీటి నిల్వను తొలగించడం ద్వారా దోమల లార్వాలు పెరగకుండా చేసి ఆరోగ్య బారిన పడకుండా చూడాలన్నారు. బస్వాంత్ ఆవరణలో మానవహారంగా ఏర్పడి మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ లక్ష్మీదేవి, సూపర్‌వైజర్ నరసారెడ్డి, జయమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, సుబ్బయ్య, ల్యాబ్ టెక్నీషియన్ బసవన్ననాయక్, ఆశా, వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది మలేరియా వ్యాధి నివారణపై గోరంట్లలో ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ మలేరియా నిర్మూలనా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ స్మృతి ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై ప్రదర్శన జరిపారు. ఆరోగ్య విస్తరణ అధికారి రమణ, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్లు రసూల్, సువర్ణాదేవి, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మడకశిర రూరల్: దోమల నివారణ కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ లిఖిత, మలేరియా సబ్ యూనిట్ అధికారి సమీఉల్లా పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండలంలోని కదిరేపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్ఓ రమణ, సూపర్‌వైజర్ రాణి ఆరోగ్య ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

UNDER the instructions of my client M/S Shriram Finance Limited, Chennai, Branch at Hindupur, I issue thing notice to general Public. My clients intends to grant loan to followi S SAVITHA D/O S RAMACHANDRA REDDY, resident : DOOR NO: 1-236-9-1, VAJRALA PETA, NEAR ABCC BANK, PENUKONDA, ANANTAPUR. by keeping the below mentioned property of him, as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, Mortgage, Sale agreements, court attachments, court disputes etc, shall be informed to the address mentioned below in writing with in 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.

SCHEDULE OF IMMOVABLE PROPERTY

SY NO: 202, DOCUMENT NO: 2426/2017. BOUNDRIES : East : OWN LAND, West : JAYARAM YADAV, NARASIMHA REDDY LAND, North : HARIPURAM TO KURUBAVANDLA PALLI ROAD, South : OWN LAND.

H. NAGESWARA RAO, ADVOCATE HINDUPUR, CELL: 7981346170

ఆంధ్రజ్యోతి

బంగారం కొనబడును

పాత బంగారం, వెండి, ప్రైవేట్ బ్యాంక్స్ ఫైనాన్స్ లో తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, సేఫ్టీ గ్యారెంటీ. 7382114647

AJA- 176998

కావలెను

ప్రముఖ ఆటో మొబైల్ సంస్థకు అనుభవం కలిగిన ఆఫీస్ మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. JK Enterprises, Opp Montessori School, Gooty Road, ATP, Cell:8008803109.

AJA-189403